www.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

సోమవారం 13 అక్టోబర్ 2025

సంగారెడ్డి సంచిక :46 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ: ఈక్వల్-వన్‌మనీ సంస్థతో కలిసి టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో పోర్ట్‌ఫోలియో 360 ఫీచరును ప్రవేశపెట్టినట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 సందర్భంగా దీన్ని ఆవిష్కరించింది. వివిధ బ్యాంకు ఖాతాలు, ఫండ్స్, ఈక్విటీలు, ఎఫ్‌డీలు మొదలైన వాటి వివరాలన్నీ ఒకే దగ్గర చూసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో ప్రతీత్ భోబె తెలిపారు. రిటైర్మెంట్‌లాంటి ఆర్థిక ప్రణాళికలు వేసుకునేందుకు ఇన్వెస్టర్లకి సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపెట్టిన కొద్ది నెలల్లోనే టాటా మ్యుచువల్ ఫండ్ యాప్ డౌన్‌లోడ్‌లు 6 లక్షల పైగా నమోదైనట్లు వివరించారు.



## నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే

# ఆర్‌డీఆర్ వల్లే

### తుంగతుర్తి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవేనన్న సీఎం

### 24 గంటల్లోనే జీవో జారీ చేస్తామని వెల్లడి

- ఎస్సారెస్పీ-2కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు: రేవంత్‌రెడ్డి
- ఆనాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ ప్రాజెక్టును తీసుకొచ్చారు
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా ఉన్నా దామోదర్ రెడ్డి.. తన ఆస్తులు నల్గొండ, ఖమ్మం జిల్లా ప్రజలకే అంకితం చేశారు
- భవిష్యత్తులో ఏ అవకాశం వచ్చినా దామోదర్ రెడ్డి కుటుంబానికి గాంధీ కుటుంబం అండగా ఉంటుంది

సూర్యాపేట

ఎస్సారెస్పీ స్టేజ్ -2పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ స్టేజ్ -2కి ఆర్డీ ఆర్ స్టేజ్ 2 - గా నామకరణం చేస్తూ 24 గంటల్లోగా జీవో ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంపై పోరాడి ఎస్సారెస్పీ స్టేజ్ -2ని సాధించి గోదావరి జలాలు రప్పించడంలో దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారని ప్రశంసించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా ఉన్నా దామోదర్ రెడ్డి.. తన ఆస్తులు నల్గొండ, ఖమ్మం జిల్లా ప్రజలకే అంకితం చేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఏ అవకాశం వచ్చినా దామోదర్ రెడ్డి కుటుంబానికి గాంధీ కుటుంబం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటిచ్చారు. ఆదివారం తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాపసభ జరిగింది. దామోదర్‌రెడ్డి - మిగతా3లో



## ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!

ఈజిప్ట్ వేదికగా ఇజ్రాయెల్ గాజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది.

మరోవైపు.. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం.



## సైనిక స్థావరాలపై తాలిబన్‌ల దాడి

58 మంది పాక్ సైనికులు మృతి

పాక్ సేనలు అఫ్గాన్ రాజధాని కాబూల్‌పై దాడికి పాల్పడగా.. ప్రతీకారంగా తాలిబన్ సైన్యం పాక్ సైనిక స్థావరాలపై దాడులు



## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- ఈటల, సంజయ్ ఎక్కడ దాక్కున్నారు?'
- బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీ.. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది
- ఢిల్లీకి వెళ్తాం. సుప్రీంకోర్టు తలుపు తడుతాం
- ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు మేం భయపడం
- బీసీ రిజర్వేషన్ల పెంపుపై మా చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు
- బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం

హైదరాబాద్

యూపీఏ హయంలో చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పుకొచ్చారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్టు తెలిపారు. బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీ.. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. టీపీసీసీ - మిగతా3లో

## కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి



- రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్
- జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ
- రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ
- ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పిలుపు

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ - మిగతా3లో



## ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!

భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..

లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరి

మిగతా వారికి చెరో ఆరు చొప్పున సీట్లు

## అవసరమైతే పోరాటానికి వెనుకాడం.. ట్రంప్ టారిఫ్స్‌పై చైనా కామెంట్



## జేడీయూలో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి..

నలుగురు సిట్టింగ్‌లకు ఉద్వాసన?

243 స్థానాల్లో 103 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉందని ఓ సీనియర్ నేత వెల్లడి

దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారు

# తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు..



### ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య..

### వైస్ ఛైర్మన్‌గా వీజీ నారగోని

హైదరాబాద్

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశారు. జేఏసీ ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ ఛైర్మన్‌గా వీజీ నారగోని వ్యవహరించనున్నారు. బీసీ జేఏసీలో ముఖ్యమైన ఆరుగురితో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే.. కేంద్రంపై ప్రభావం పడుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లలో ఏ అంశం మీద కోర్టు స్టే ఇచ్చిందని కృష్ణయ్య ప్రశ్నించారు. " ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక స్టే ఇవ్వకూడదు. బీసీలకు న్యాయం కోసం ఈ నెల 18న బంద్‌కు పిలుపునిచ్చాం. అన్యాయాన్ని 76 ఏళ్లుగా బీసీలు భరిస్తూ వస్తున్నారు. బీసీలకు అన్యాయంతోపాటు ఇప్పుడు అవమానం జరిగింది. చట్టసభల్లో బిల్లు పెట్టే వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం" అని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

## గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఉద్రిక్తత.. రోగి మృతితో బంధువుల ఆందోళన

- గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత
- కాలేయ మార్పిడి చికిత్స పొందుతూ మురళీధర్ అనే వ్యక్తి మృతి
- వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- 45 రోజుల చికిత్సకు రూ.85 లక్షలు వసూలు చేశారని ఆవేదన
- జీవన్‌దాన్‌లో వయసు తప్పుగా నమోదు చేయడం వల్లే సమస్యలొచ్చాయని ఆరోపణ

# ఆలమూరు మండలాన్ని తూగో జిల్లాలో విలీనం చేయాలి.



**సామాన్యుడి అస్త్రం కోనసీమ :** జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ పలువురు మండల ప్రజలు పిలుపునిచ్చాయి. జొన్నాడ రైతు భవనం (పెద్ద కళ్యాణ మండపం) వేదికగా పలు రాజకీయ, ప్రజా సంఘాల పార్టీలకు అతీతంగా ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం అన్ని రంగాలు రాజమహేంద్రవరంతోనే అనుబంధం ఉండటంతో పాటు, జిల్లా కేంద్రమైన అమలాపురం దూరంగా ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.మన మండలాన్ని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలపాలని, ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమ కార్యాచరణకు తగిన ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి మండలాన్ని తూర్పుగోదావరిలో కలపాలని తీర్మానాలు సేకరిస్తున్నామని, త్వరలోనే ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. పలువురు రాజకీయ నాయకులు, 18 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నారన్నారు. అనంతరం 35 మంది సభ్యులతో జేఏసీ కమిటీని ఏర్పాటు చేసి, ఐదుగురు సభ్యులతో స్టీరింగ్ కమిటీని నియమించారు. ఈ సభ్యులందరూ కలిసి ఒకే కార్యచరణకు ముందుకు సాగుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొపనాతి శ్రీనివాసరావు, తాడి మధు సూదన రెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నుండి కె. రామకృష్ణ, బి.ఎస్.పి. నుండి గుర్రపు కొత్తియ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్,అధ్యక్షులు వెంకట్, నెక్కంటి వెంకటరాయుడు (బుజ్జి) సర్పంచులు గుణ్ణం రాంబాబు, కట్టా శ్రీనివాస్,దూలం సత్తిబాబు,నాతి కుమార్ రాజా, చింతపల్లి నాగేశ్వరరావు,పాలింగి ఉమాదేవి, షేక్ షరీఫ్, కట్టా ప్రసాద్,పలువురు ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కోడెలి అంగన్వాడీ శిధిలావస్థ ఇరవై మంది చిన్నారులు ప్రమాదపు అంచునపట్టించుకోని అధికారులనిర్లక్ష్యం





**సామాన్యుడి అస్త్రం అల్లూరి** హుకుంపేట మండలం గూడ పంచాయతీ కోడెల గ్రామం లో అంగన్వాడీలో భయంతో చదువుతున్న బుజ్జి పసివాళ్లుఎప్పుడైనా గోడలు కూలిపోవచ్చున్న తల్లిదండ్రుల ఆందోళన,చెవిన పెట్టని ప్రజాప్రతినిధులుకోడెలి అంగన్వాడీ ప్రమాదం నోకుతున్న పసి జీవితాలుహుకుంపేట మండలంలోని గూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కోడెలి అంగన్వాడీ భవనం ప్రస్తుతం ప్రాణాపాయం తలపిస్తోంది. కాలం గడుస్తూ, మరమ్మతులు లేక, గోడలు చీలిపోయి, పైకప్పు ముక్కలు ఊడిపోతూ, ప్రతి రోజూ ఏ క్షణానైనా కూలిపోవచ్చున్న పరిస్థితి నెలకొంది. ఈ భవనంలో రోజూ తరగతులు జరుగుతున్న 20మంది పసి బాలబాలికలు భయంతో చదువుకుంటున్నారు.నిర్లక్ష్యమే ప్రధాన కారణంస్థానికులు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్ పునరావృతంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ సమస్యపై లేఖలు, విజ్ఞప్తులు చేశారు. అయినా చర్యలు ఏవీ తీసుకోకపోవడం గ్రామ ప్రజలలో ఆగ్రహంతో పాటు ఆందోళన కూడా పెంచుతోంది. “పిల్లలతో తరగతి గడపడం ప్రతి రోజు ప్రాణాల పణంగా మారింది” అని అంగన్వాడీ టీచర్ వేయిముఖంగా చెప్పింది.పిల్లల తల్లిదండ్రుల విన్నపంతల్లిదండ్రులు “మన చిన్నారులు అంగన్వాడీ భవనం కూలిపోతే ఏం జరుగుతుందో అనుమానంతో భయపడుతున్నారు. వేసవి గాలి, వర్షపు నీరు, చలికాలపు చలి అన్ని ముప్పులు వీరిని అలుముకుంటున్నాయి” అని చెబుతున్నారు. కనీసం తాత్కాలిక భద్రతా చర్యలు తీసి కొత్త భవనం నిర్మించాలి అని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించాలిగ్రామస్తులు, తల్లిదండ్రులు ఏకగళంగా, పిల్లల ప్రాణాలు రక్షించడానికి తక్షణమే కొత్త అంగన్వాడీ భవనం నిర్మించాలి అని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పసిప్రాణాలు ప్రమాదంలో ఉన్నప్పుడు, నిర్లక్ష్యానికి చోటు లేకూడదు అని స్థానికుల మాట.

# షాద్ నగర్ బస్టాండులో పల్స్ పోలియో ప్రోగ్రామ్ ప్రారంభించిన..





**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**
**డాక్టర్ వి విజయలక్ష్మి**
**డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ..**

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ఈరోజు షాద్ నగర్ బస్టాండ్లో డిప్యూటీ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ విజయలక్ష్మి ఆదేశానుసారం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్ నేషనల్ డే పల్స్ పోలియో ప్రోగ్రామ్ ను షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించబడింది. వీర్లపల్లి శంకర్ 5 సంవత్సరంలోని పిల్లల కీ పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమమునకు కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, యాదగిరి, బసవప్ప, సీతారాం, లైబ్రరీ వైస్ చైర్మన్ బాలరాజ్, ప్రవీణ్, రాము, ముబారక్, చిన్న, ఖదీర్, రాజు నాయక్, అర్జున్ కుమార్ మరియు డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ జె శ్రీనివాసులు , ఎంఎల్ హెచ్ పి వైద్య అధికారులు ముస్తాకిన్ హమ్మద్, దినేష్ ,స్టాఫ్ నర్స్ పకీరమ్మ ,ఏఎన్ఎంలు శిరీష, భారతి మరియు ఆశాలు పాల్గొన్నారు

# పాలకుర్తి లో నిర్వహించిన కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**సమావేశంలో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, అబ్జర్వర్లు**

**కొనసాగిన సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** డిసిసి అధ్యక్షుడి ఎన్నిక కోసం అధిష్టానం చేపట్టిన “సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ” కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లాలో రెండో రోజు కొనసాగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ రోజు సాయంత్రం పాలకుర్తి నియోజకవర్గం లో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా అబ్జర్వర్లు మీడియా సమక్షంలో డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు ఫారమ్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా అబ్జర్వర్లు స్థానిక నాయకులతో ముఖాముఖిగా చర్చించి,డీసీసీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల అభ్యర్థుల అభిప్రాయాలు, సూచనలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్,టీపీసీసీ అబ్జర్వర్ మరియు షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, స్థానిక శాసనసభ్యులు యశస్విని రెడ్డి జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి టీపీసీసీ ప్రతినిధులు ఎం.డి. అవేజ్, శ్రీకాంత్ యాదవ్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, జిల్లా స్థాయి నాయకులు భారీగా పాల్గొన్నారు.

# గిరిజన సహకార సంస్థల బలోపేతం, పార్లమెంట్ పరిధి సమస్యల పరిష్కారంపై లోకేష్‌తో కిడారి శ్రవణ్ కుమార్ చర్చ



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** విశాఖపట్నం విమానాశ్రయంలో ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ని మాజీ మంత్రివర్యులు, పార్లమెంట్ అధ్యక్షులు మరియు జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన సహకార సంస్థల అభివృద్ధి, వాటి కార్యకలాపాల విస్తరణ, గిరిజన ప్రాంతాల ఆర్థిక పురోగతిపై లోకేష్ తో విశదంగా చర్చించారు. అదే విధంగా పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మరియు ఉపాధి అవకాశాలపై కూడా సూచనలు ఇచ్చారు. ఐటీ శాఖ మంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తగిన ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పానుగంటి ప్రవీణ్ జ్ఞాపకార్థం జనగామ లో అన్నదాన కార్యక్రమం



**సామాన్యుడి అస్త్రం జనగామ:** జనగామ పట్టణ టిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీ పానుగంటి ప్రవీణ్ కుమార్ జ్ఞాపకార్థం ఆయన జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి శ్రీ పానుగంటి సువార్త ఈరోజు శ్రీ రాజరాజేశ్వరి వృద్ధాశ్రమం మరియు రెడ్డి సంక్షేమ సంఘం లో ఉన్నటువంటి అనాధ వృద్ధులకు బాలబాలికలకు దాదాపు 40 మందికి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది

# ఆటోలోనే నిండు గర్బిణీ స్త్రీ ప్రసవం

**జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నెల్లుట్ల వద్ద ఘటన**



**సామాన్యుడి అస్త్రం జనగామ :** అంబులెన్స్ ఆలస్యం అవుతుండడంతో అదే గ్రామానికి చెందిన శ్రీశైలం అనేవ్యక్తి ఆటోలో ఆస్పత్రికి ప్రయాణం నెల్లుట్ల గ్రామం వద్దకు రాగానే పురిటినొప్పులు తీవ్రం కావడంతో ఆశా కార్యకర్తలకు ఫోన్ లో సమాచారమిచ్చిన ఆటోడ్రైవర్ శ్రీశైలం నెల్లుట్ల గ్రామం వద్ద రోడ్డుపైనే ఆటో ఆపి గర్బిణికి పురుడుపోసిన ఆశా కార్యకర్తలు అరుణ, పుష్ప, ఉమ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన కనకలక్ష్మి ప్రసవం అనంతరం తల్లి, కొడుకులను ఆస్పత్రికి తరలింపు ఆటో డ్రైవర్ శ్రీశైలం, ఆశా కార్యకర్తలను అభినందించిన కుటుంబసభ్యులు, స్థానికులు

# అనుమానస్పద స్థితిలో కొప్పు కుమార్ మృతి

**కొప్పు కుమార్ కు తీవ్ర రక్త గాయాలు**

**కేశంపేట లో ఘటన**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కిషన్ పేట మండల కేంద్రానికి చెందిన కుప్పు కుమార్ అనే దళిత యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇంట్లోనే నీటి సంపులో అతను శవమై తేలడం గమనార్హం. వృత్తిరీత్యా కూలీనాలీ చేసుకొనే కుమార్ ఈరోజు ఉదయం తెల్లవారు జామున నీటి సంపులో శవమై కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. కుమార్ తలపై బలమైన రక్త గాయాలు ఉన్నాయి. కుమార్ మృతికి కారణాలు తెలియరావడం లేదు. కుమార్ ను ఎవరైనా హత్య చేశారా పథకం ప్రకారం హత్య చేసి నీటి సంపులో పడేశారా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కుమార్ ఆకస్మిక మృతితో విషాద వాతావరణం నెలకొంది

# కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిని కలిసిన కమలాపూర్ నేతలు

**గ్రామాల అభివృద్ధి కోసం 5లక్షలు సాంక్షన్ చేసిన ఎంపీ బండి సంజయ్**

**కమలాపూర్ మండల అన్ని గ్రామల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తా సంజయ్ కుమార్**



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ ని కలిసిన కమలాపూర్ నేతలు. పలు గ్రామాలకు అభివృద్ధి పనుల కోసం మాట్లాడగా పంగిడిపల్లి నేరెళ్ల ఉప్పులపల్లి గ్రామాలకు వాటర్ ప్లాంట్లను సాంక్షన్ చేయడం జరిగింది అలాగే రైతులకు ఇబ్బంది కలగకుండా వారు పొలాలకు వెళ్లేందుకు వెసులుబాటు కోసం ఉప్పులపల్లె మరియు బీంపల్లి గ్రామాలకు ఎంపీ నిధులు ద్వారా ఐదు లక్షల చొప్పున శాంక్షన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కమలాపూర్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో తీసుకురావడానికి నిధులను కేటాయించి తన వంతు సహకారాన్ని అందిస్తానని నాకు ఓట్లేసిన ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. బండి సంజయ్ కుమార్ ను కలిసిన వారిలో కమలాపూర్ మండలా ధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి వలిగే సాంబారావు, మండల ప్రధాన కార్యదర్శి భూపతి ప్రవీణ్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు అక్కినపల్లి రవీందర్, సీనియర్ నాయకులు సముద్రాల మొగిలి ఉన్నారు

# గ్రామస్తుల సమిష్ఠ కృషితో శ్రమదానం

**శ్రమదానం చేస్తున్న చామనపల్లి, న్యూ కొత్తపల్లి గ్రామ ప్రజలు యువకులు,**

**బస్సు ఇతర వాహనాల ప్రయాణికులకు రాకపోకలకు అడ్డుగా అంతరాయంగా ఏర్పడిన రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు కొమ్మలను తొలగింపు,**





**సామాన్యుని అస్త్రం ధర్మారం :** సమిష్టి కృషితో సాధ్యం కానిది ఏది లేదనే విషయాన్ని ఆచరణలో పెట్టి చూపారు ఆ గ్రామస్తులు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామానికి వెళ్లే దారికి ఇరువైపుగా అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను, పిచ్చి మొక్కలను కంప చెట్లను తొలగించెందుకే శ్రమదానం రెండు రోజులుగా చేస్తున్నారు, పిచ్చి మొక్కలు పెరిగడంతో పది రోజులుగా కుమ్మరి కుంట వయా కొత్తూర్, న్యూ కొత్తపల్లి, చామనపల్లి గ్రామాల మీదుగా ధర్మారం మోడల్ స్కూల్, ధర్మారం వెళ్లే బస్సు రావడం నిలిపివేయడంతో స్కూల్ కి వెళ్లే విద్యార్థిని విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారని రెండు రోజులుగా చామనపల్లి కొత్తపల్లి న్యూ గ్రామాల ప్రజలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను శ్రమదానం చేసి తొలగించారు పెద్ద కొమ్మలకు రావడానికి ఇబ్బంది పడ్డపరిస్థితిలో కటికనపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ రామడుగు గంగారెడ్డి తన సొంత జెసిబిని చామనపల్లి కటికపెల్లి రోడ్డు సైడ్ శుక్రవారం రోజున పంపించి సేవలో పాలుపంచుకోగా, ఆదివారం రోజున కొత్తూరు నుండి చామనపల్లి మీదుగా కటికనపల్లి వరకు ఉన్న రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్ల మండలను పిచ్చి మొక్కలను తొలగించి వాహనా దారులకు ఇబ్బంది లేకుండా చేసిన చామనపల్లి న్యూ కొత్తపల్లి గ్రామస్తులు యువకులు ఈ కార్యక్రమంలో భాజపా మండల శాఖ అధ్యక్షుడు తీగుళ్ల సతీష్ రెడ్డి, చామనపల్లి కాంగ్రెస్ నాయకుడు వేల్పుల నాగరాజు, న్యూ కొత్తపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ అయితర వేణి రమేష్, జంజుపల్లి సురేందర్,సుందరగిరి చందు,కొమ్మ లచ్చయ్య, ఆవుల సంపత్, తిరుపతి ,శివ, నరసయ్య, సంధినేని సంతోష్,అరుణ్, కూనారపు రాములు,బోగే గట్టు,తో పాటు రెండు గ్రామాల ప్రజలు యువకులు పాల్గొన్నారు,

# జనం గుండెలో కౌశిక్ రెడ్డి పొనగంటి సంపత్ సింగిల్ విండో చెర్మన్

**కుట్రలను తిప్పి కొడదాం.. జననేతను కాపాడుకుందాం**



**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** రాజకీయ రంగప్రవేశం చేసిన అనతి కాలంలోనే జనం గుండెలో తనదైన ముద్ర వేసుకున్న మన ప్రియతమ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రజా సమస్యలపై నిర్విరామంగా పోరాడుతున్నారు. కష్టాల్లో ఉన్నవారికి నిస్వార్థంగా సేవలందిస్తున్నారు. ఆపన్నులను అక్కున చేర్చుకుంటూ వారి జీవితాలకు భరోసా కల్పిస్తున్నారు. ప్రస్తుతం హుజూరాబాద్ నియోజకవర్గానికి కౌశిక్ రెడ్డి అంటే ఒక ధైర్యం. ఒక స్థైర్యం. అంతకుమించిన మనోబలం. ప్రతి కుటుంబానికి పెద్దన్నలా చేదోడు వాదోడుగా నిలుస్తున్న కౌశిక్ రెడ్డిని నియోజకవర్గ ప్రజలంతా కడుపులో పెట్టుకొని కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. హుజూరాబాద్ నియోజకవర్గానికి ఈటల రాజేందర్ చీడలా మారారు. అసెంబ్లీ ఎన్నికల్లో జనం గుణపాఠం నేర్పిన బుద్ధి రాని ఈటల మళ్లీ నియోజకవర్గాన్ని పట్టిపీడిస్తున్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కుట్రలకు పాల్పడుతూ క్షుద్ర రాజకీయాలకు తెరతీశారు. ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా ఉన్న ఈటెల రాజేందర్ కు ప్రజాదరణ కరువైంది. బిజెపిలో దిక్కార స్వరం వినిపిస్తున్న ఆయనకు అధిష్టానం నుండి చీత్కారాలు, అవమానాలు ఎదురవుతున్నాయి. ఎటూ పాలు పోని ఈటల రాజేందర్ మళ్లీ హుజురాబాద్ లో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. జనాన్ని రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం సృష్టిస్తున్నారు. కొందరు చెంచా గాళ్లను వెంటబెట్టుకొని చిల్లర రాజకీయం చేస్తున్నారు. ప్రస్తుతం హుజురాబాద్ నియోజకవర్గం కౌశిక్ రెడ్డి కి కంచుకోటగా మారింది. కౌశిక్ నాయకత్వంలో ప్రజానీకం సంతోషంగా ఉంది. ఇది జీర్ణించుకొని ఈటల రాజేందర్ కుట్రలకు బరితెగించారు. కౌశిక్ పై తరచూ అసత్య ఆరోపణలు గుప్పిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవాలను వక్రీకరిస్తూ సూర్యుని లాంటి కౌశిక్ పై ఉమ్మేసే యత్నాలు సాగిస్తున్నారు. ఆ పాపాలు చివరికి ఆయనకే చుట్టుకుని బలికాక తప్పదు. రెండు దఫాలు మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ అవినీతికి అంతే లేదు. ఇది జగమెరిగిన సత్యం. తొలినాళ్లలో తిండికి లేని ఈటల నేడు వేల కోట్లు సంపాదించారు. ఇదంతా అవినీతి సొమ్ము కాదా. హైదరాబాదులో 100 కోట్లతో భవనం కట్టుకుని విలాసవంతమైన జీవితం గడుపుతున్నది వాస్తవం కాదా. దోపిడీ సొమ్ముతో వ్యాపార సామ్రాజ్యాన్ని వేల కోట్లకు విస్తరించింది నిజమా కాదా. తండ్రిలా చేరదీసిన కెసిఆర్ ని ఈటెల రాజేందర్ నిలువునా మోసం చేశాడు. తల్లి లాంటి బిఆర్ఎస్ కు ద్రోహం చేసి నయవంచనకు మారుపేరుగా నిలిచాడు. అందరూ నా గుప్పిట్లో ఉండాలని, కార్యకర్తలు బానిసలుగా బతకాలని కోరుకునే వారిలో ఈటెల రాజేందర్ ముందు వరుసలో ఉంటారు. ఇదీ ఆయన నైజం. అవసరానికి అందరినీ వాడుకుని వదిలేయడం ఈటల మనస్థత్వం. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇప్పుడు బలమైన నాయకత్వం ఉంది. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో లేకున్నా ఎమ్మెల్యే కౌశిక్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధిస్తున్నారు. జనాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఇది మింగుడు పడని ఈటెల రాజేందర్ నియోజకవర్గాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈటెల కుతంత్రాలను తిప్పి కొట్టేందుకు బిఆర్ఎస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు సమాయత్తం కావాలి. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న కౌశిక్ ను కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలి. ఇక రానున్నది మన బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఈనేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబి జెండా ఎగరేలా చేయాలి.

# కొనుగోలు కేంద్రాలెక్కడ?

**నిర్మల్ జిల్లాలో ఇంకా తెరుచుకోని మక్కల కొనుగోలు సెంటర్లు**

**చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు**

**బహిరంగ మార్కెట్‌లో దక్కని మద్దతు ధర**

**అందినకాడికి దండుకుంటున్న దళారులు, వ్యాపారులు**

**క్వింటాలు మక్కలు రూ.1900లకే కొనుగోలు**

**వేలాది రూపాయలు నష్టపోతున్న రైతులు**



**నిర్మల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మక్క రైతులకు కష్టాలు తప్పడం లేదు. రెండేళ్లుగా మక్కల కొనుగోళ్లపై ప్రభుత్వం చేతులెత్తేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటకు మద్దతు ధర దక్కక నష్టపోతున్నారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతుల కష్టాన్ని దళారులు, ప్రైవేట్ వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోతుండడంపై రైతులు మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలం సీజన్‌లో 16వేల ఎకరాల్లో రైతులు మక్కజొన్న పంటను సాగు చేశారు. జిల్లాలో ఈ సారి 4,800 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అధిక వర్షాలతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. చాలా చోట్ల తెంపి ఆరబెట్టిన మక్క కంకులు కూడా తడిసిపోయాయి. కొన్ని చోట్ల కంకులకు మొలకలు వచ్చాయి. మిగిలిన పంటనైనా అమ్ముదామంటే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఇదే అదునుగా దళారులు, ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా పంటకు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని నిర్మల్, సోన్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ), లక్ష్మణచాంద, సారంగాపూర్, ఖానాపూర్ మండలాల్లో మక్కపంట చేతికి రాగా, రైతులు మక్కలను రోడ్లపై ఆరబెట్టి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారోనని ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే మక్క రైతులకు క్వింటాలుకు రూ.330 బోనస్ కూడా ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. ప్రస్తుతం బోనస్ సంగతి దేవుడెరుగు.. అసలు మద్దతు ధరకే కాంగ్రెస్ సర్కారు ఎసరు పెట్టిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

**తగ్గిన పంట దిగుబడి**

%ఈ వానకాలం సీజన్‌లో భారీ వర్షాలు కురియడంతో దాని ప్రభావం పంట దిగుబడిపై పడింది. ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల పంట దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం ఎకరానికి 20 క్వింటాళ్ల కంటే ఎక్కువగా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తగ్గిన పంట దిగుబడికి తోడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ప్రైవేట్ వ్యాపారులు మంచి నాణ్యత కలిగిన మక్కలను రూ.1800 నుంచి 1900లకు కొనుగోలు చేస్తుండగా, సాధారణ రకం మక్కలకు రూ.1500 మాత్రమే చెల్లిస్తున్నారు. మద్దతు ధరతో పోల్చితే రైతులు క్వింటాలుకు రూ.500 నుంచి 700 వరకు నష్టపోతున్నారు. ప్రస్తుతం ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసుకుంటే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎకరానికి రూ.10వేల నుంచి 14వేల వరకు రైతులు నష్టపోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్వింటాల్‌కు రూ.2,400 మద్దతు ధరను కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**రూ.13 వేలు నష్టపోయిన**

ఈ వానకాలం సీజన్‌లో రెండెకరాల్లో మక్క పంట వేసిన. ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు వస్తుందని అనుకున్న. వానలతో పంట దెబ్బతిని 13 క్వింటాళ్ల చొప్పున రెండు ఎకరాలకు 26 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు లేక ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1900లకు అమ్మిన. క్వింటాలుకు రూ.500 చొప్పున 13వేల నష్టపోయిన. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మక్కలు కొంటలేరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి బాధలు లేకుండే.

**కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

3 ఎకరాల్లో రెండెకరాల్లో వరి, ఎకరంలో మక్కపంట వేసిన. మక్క పంటకు పెట్టుబడి ఖర్చులు రూ.10వేల వరకు కాగా, 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ సారి మక్కలకు ధర లేకపోవడంతో నష్టపోతున్నాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు రూ.1900 చొప్పున అమ్మిన. ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రూ.10వేల వరకు అదనంగా వచ్చేవి. ఇప్పటికైనా కేంద్రాలను ఏర్పాటు చేసి మక్క రైతులను ఆదుకోవాలి.

## ప్రత్యేక ఆదివాసీ డిఎస్సి సాధనకై 13న చలో రంపచోడవరం.

**ఆదివాసీ హక్కులు,చట్టాలు సాధనకై శాంతియుత ఐక్య పోరాటాలకి ఆదివాసులంతా సిద్ధం కండి.ఏపీ ఆదివాసీ జేఏసీ పిలుపు.**



**సామాన్యుడు అస్త్రం దేవీపట్నం :** ప్రత్యేక ఆదివాసీ డిఎస్సి ప్రకటించాలని, ఆదివాసీ హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని అక్టోబర్ 13వ తేదీన చలో రంపచోడవరం ఐటీడీఏ కార్యక్రమానికి ఆదివాసులందరూ తరలిరావాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు 100% ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టీఏసీ) ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని ,ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని,ఆదివాసీ హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని అల్లూరి సీతారామ జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆదివాసీ నిరుద్యోగులు ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతీ యువకులు,ఆదివాసీ సంఘాల నాయకులు పెసా కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,కార్యదర్శులు అందరూ పాల్గొని ఆదివాసులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిద్దాం అన్నారు.ముందుగా రంపచోడవరం ఐటీడీఏ నుండి శాంతియుతంగా ర్యాలీ జరుగుతుందన్నారు.

## కానిస్టేబుల్ కుమారుడికి ఎంబీబీఎస్ లో 829 ర్యాంక్

**... అభినంధించిన సీపీ సాయి చైతన్య**




**సామాన్యుడి అస్త్రం నిజామాబాద్ :** కానిస్టేబుల్ కుమారుడు ఛత్రపతి శివాజీకి ఎంబీబీఎస్ లో 829 ర్యాంక్ సాధించారు. నగరంలోని నాందేవ్ వాడ కు చెందిన ట్రాన్స్ కో విజిలెన్స్ కానిస్టేబుల్ సతీష్, మమత దంపతుల కుమారుడు ఛత్రపతి శివాజీ ఎం బీబీ ఎస్ లో 829 ర్యాంక్ సాధించి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం ఎం బీ బీ ఎస్ సీటు సాధించిన విద్యార్థిని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.ఛత్రపతి శివాజీ ఎం బీ బీ ఎస్ లో సీటు సాధించడం పట్ల బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

# డీసీసీ అధ్యక్షులపై కసరత్తు

**మహబూబ్‌నగర్:** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రద్దుతో ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. ఇదే క్రమంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టడం.. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న డీసీసీ అధ్యక్ష పీఠాల భర్తీకి కసరత్తు ప్రారంభించడంతో పార్టీలో మళ్లీ సందడి మొదలైంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఖరారుకు సంబంధించి ఏఐసీసీ పరిశీలకులుగా నియమితులైన వారు జిల్లాల బాట పట్టారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిశీలకుడు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి శనివారం పాలమూరుకు చేరుకున్నారు. ముందుగా నారాయణపేటలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌కు చేరుకుని స్థానిక నేతలతో ముచ్చటించారు. ఆదివారం నుంచి ఈ రెండు జిల్లాల్లో అభిప్రాయాల సేకరణతో పాటు డీసీసీ అధ్యక్షుల ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదేవిధంగా మరో పరిశీలకుడు పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి ఆదివారం నాగర్‌కర్నూల్, 14న వనపర్తి, 16న జోగులాంబ గద్వాలలో పర్యటించనున్నారు.

**నవంబర్‌లో ఖరారయ్యే అవకాశాలు**

ఏఐసీసీ పరిశీలకులు ఆయా జిల్లాల్లో పర్యటిస్తూ డీసీసీ అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తే బాగుంటుందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు. అదేవిధంగా అధ్యక్ష పదవులను ఆశిస్తున్న నేతల నుంచి ఈ నెల 18వ తేదీ దాకా దరఖాస్తులు స్వీకరించనున్నారు. వడబోత తర్వాత ఒక్కో జిల్లాకు ఆరుగురి పేర్లతో ఈ నెల 22వ తేదీ నాటికి అటు ఏఐసీసీ, ఇటు పీసీసీకి అందజేయనున్నారు. అనంతరం సీఎం ఇతర ముఖ్య నేతలు జిల్లా ఇన్‌చార్జిలు, ఇన్‌చార్జి మంత్రు లు, ఆయా జిల్లాల నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతిని ధ్యం వహిస్తున్న మంత్రులతో సంప్రదింపులు జరి పి సామాజిక వర్గాల (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్, మహిళ) వారీగా పార్టీ జిల్లా అధ్యక్ష పదవులను కేటాయించనున్నారు. మొత్తానికి వచ్చే నెల తొలివారంలో డీసీసీ అధ్యక్షులు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఆశావహులు తాము చేసిన దరఖాస్తుల్లో పార్టీకి అందించిన సేవలు, అనుభవం, గతంలో నిర్వర్తించిన బాధ్యతలు తదితర వివరాలను స్పష్టంగా పేర్కొంటూ బయోడేటా ఇవ్వాలని పరిశీలకులు సూచిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి డీసీసీ చీఫ్‌గా ఉన్నారు. ఆయనతో పాటు ఈ పదవి కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేష్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పోటీపడుతున్నారు.

## సంపాదకీయం

# గాజాలో శాంతివీచిక!

రెండేళ్ల నుంచి అవిచ్ఛిన్నంగా క్షిపణులు, బాంబుల వర్షంతో కంటిమీద కునుకు లేకుండా గడిపిన గాజా ఇకపై గుండెల నిండా ఊపిరి పీల్చుకోనుంది. హమాస్%-% ఇజ్రాయెల్ యుద్ధం ఆగిపోయిందనీ, ఇరు పక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాయనీ, శాంతి ప్రణాళికలో ఇది తొలి దశ అనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గమనిస్తే పూర్తిస్థాయి శాంతి స్థాపనకు మరికొంత సమయం పట్టొచ్చని స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత హడావిడిగా సంధి కుదిరినట్టు ప్రకటించటం వెనక శుక్రవారం ప్రకటించబోయే నోబెల్ శాంతి బహుమతికి అర్హత సాధించటం కోసమేనని అందరికీ తెలుసు. ట్రంప్ అందుకు అర్హుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫార్సు చేస్తున్నారు. తమ భూభాగంలోకి చొరబడి 2023 అక్టోబర్ 7న 1,100 మంది పౌరులను హతమార్చి, 251 మందిని అపహరించుకుపోయిన హమాస్ దుందుడుకు చర్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ 24 నెలల పాటు గాజాపై నిప్పుల వాన కురిపించింది. ఏ క్షిపణి ఎక్కడ పడుతుందో, ఏ బాంబు ఎవరి ప్రాణం తీస్తుందో తెలియక గాజా వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. జనావాస ప్రాంతాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా క్షిపణులు ప్రయోగించటం, ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లు క్షణంలో కూలి శిథిలాల గుట్టగా మారటం ప్రపంచ ప్రజలంతా చూశారు. కనీసం ఇద్దరో ముగ్గురో మరణించని కుటుంబం లేదు. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాలు... ఇజ్రాయెల్ ఉల్లంఘనల వల్ల పెద్దగా ఉపశమనం ఇచ్చింది లేదు. దీన్ని యుద్ధం అనడం ఇజ్రాయెల్ సాగించిన నరమేధాన్ని కప్పిపుచ్చే యత్నమే అవుతుంది. బలాబలాల్లో ఎంత వ్యత్యాసం ఉన్నా రెండు దేశాల మధ్య పరస్పరం కొన సాగే ఘర్షణల్ని యుద్ధం అంటారు. ఇక్కడ జరిగిందంతా వేరు. ఇజ్రాయెల్ లోపాయకారీ మద్దతుతో ఎన్నికల ద్వారా అధికారం చేజిక్కించుకుని గాజా ప్రజలపై పెత్తనం సాగిస్తూ, పాలస్తీనా అథారిటీని బేఖాతరు చేస్తూ వచ్చిన హమాస్ ఉన్నట్టుండి ఉగ్రవాద దాడికి పూనుకొంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో అధికారిక లెక్కల ప్రకారమే 67,183 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 1,69,841 మంది గాయాల పాలయ్యారు. వైద్య సిబ్బంది, పాత్రికేయులన్న విచక్షణ లేకపోగా, చాలా సందర్భాల్లో వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యాలు హతమార్చటం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనిది. దాడులు ఆగుతాయంటున్నారు గనుక శిథిలాల తొలగింపు మొదలవుతుంది. అప్పుడు గానీ మృతుల అసలు సంఖ్య ఎంతో తెలియకపోవచ్చు. ఇప్పటికీ ఆచూకీ తెలియనివారు వేలల్లో ఉన్నారు. ఇజ్రాయెల్ ఘాతుకాల వెనక జాత్యహంకారం స్పష్టంగా కనబడుతుండగా, ఆ దుండగాన్ని ధర్మబద్ధంగా వ్యతిరేకించినవారిని యూదులపై వివక్ష ప్రదర్శిస్తున్నవారిగా జమకట్టి వేధించటం, విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులు చొరబడి అరెస్టులు చేయటం ట్రంప్ నైజానికి అద్దం పడుతుంది. గాజాలో హమాస్ ఒక్కటే లేదు. పాలస్తీనా విమోచన కోసం పోరాడే సంస్థలు డజను వరకూ ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి పోలేదు. గాజాలోనే ఒక హద్దు నిర్ణయించుకుని ఆగింది. ఇప్పుడు కుదిరిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఎంతవరకూ గౌరవిస్తుందో తెలియదనీ, ఒప్పందంలోని చాలా క్లాజులు అస్పష్టతతో ఉన్నా కేవలం ట్రంప్ హామీని నమ్మి సమ్మతించామనీ ఆ సంస్థల ప్రతి నిధులు చెబుతున్న తీరు గమనార్హం. ట్రంప్‌కు నోబెల్ వస్తే తప్ప ఈ ఒప్పందం సజావుగా ముందుకు పోదు. రెండో దశ చర్చల్లోనే అసలు అంశాలు ప్రస్తావనకొస్తాయి. అప్పుడు మరణమో, శరణమో పాలస్తీనా సంస్థలు తేల్చుకోక తప్పదు. ట్రంప్‌కు పురస్కారం లభిస్తే గాజా వాసులకు ఉన్నంతలో గౌరవప్రదమైన పరిష్కారం దొరకొచ్చు. రాకపోతే పరిణామాలు వేరుగా ఉండే అవకాశం ఉంది. అయితే నరమేధాన్ని కొనసాగించటం ఇక సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే హమాస్ చెరలోని బందీలంతా విడుదలయ్యారు. అటు ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా పౌరులు దాదాపు 2,000 మంది విడుదలవుతున్నారు. గాజా విషయంలో ఐక్యరాజ్య సమితిలో అమెరికా, ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయిన కొన్ని రోజులకే ఆ రెండు దేశాలూ తమకేం పట్టనట్టు ఈ శాంతి ఒప్పందం సాధించటం ఒక వైచిత్రి.

# దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం



మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వార్త ఇటీవల జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. ఒక కానిస్టేబుల్ పోస్టుకు 42 మంది పీహెచ్‌డీ స్కాలర్లు సహా 13,000 మంది దరఖాస్తు చేసుకోవడమే ఆ వార్త సారాంశం. ఈ అంకెలు క్షణకాలం పాటు ఆశ్చర్యం కలిగించినా, ఆ తర్వాత అవి మన మనసుల్లో ముద్రపడిపోతాయి. ఆ అంకెల గురించి తెలుసుకోవాలన్న ఆత్రుత వల్ల కాదు. అది మనకు ఏం చెప్తుందన్న ఉత్సుకత అందుకు కారణం. మన దేశంలో అత్యంత విద్యావంతులైన పీహెచ్‌డీ స్కాలర్లు కూడా ప్రాథమిక స్థాయి కొలువుల కోసం లైన్లలో నిల్చుంటున్నారు. ఇది ఏం సూచిస్తున్నది? ఇది దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ లక్షణమా? లేదా విద్య, అవకాశాల మధ్య ఉన్న అసమతుల్యతా? లేదా ప్రభుత్వ ఉద్యోగాల పట్ల మనకున్న శాశ్వత మోజుకు నిదర్శనమా? లేదా భారత శ్రామిక మార్కెట్ గురించి చెప్పలేని ఆందోళనా? అయితే, ఇది ఒక్క మధ్యప్రదేశ్ రాష్ట్రానికే పరిమితం కాదు. రాజస్థాన్‌లో 10 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు 3.7 లక్షల మంది పోటీపడ్డారు. ఏపీలో వేల పోస్టులకు లక్షల మంది పరీక్షలు రాశారు. ఇది పోలీసు శాఖకు మాత్రమే పరిమితం కాలేదు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల 1,846 ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. స్వీపర్ అయినా కావచ్చు, ఇంజనీర్ అయినా కావచ్చు.. ఆ పో స్టు అర్హతలకు మించినవారు చాలామంది ఎగబడుతున్నారు. ఉద్యోగ భద్రత ఉండే ప్రభుత్వ కొలువు కోసం లక్షల మంది పట్టభద్రులు పోటీపడుతున్నారు. ఇవి నియామకాల్లో కనిపించే గణాంకాలు మాత్రమే కావు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ తన జనాభా సామర్థ్యాన్ని అర్థవంతమైన ఉపాధిగా మార్చుకోలేకపో తున్నదని చెప్పేందుకు నిదర్శనం. మన దేశంలో ఏటా శ్రామిక జనాభా 90 లక్షల వరకు పెరుగుతున్నది. కానీ, ఆ మేరకు ఉద్యోగ సృష్టి మాత్రం జరగడం లేదు. ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధిస్తున్నది కానీ, అందుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. కొంతవరకు ఉపాధి సృష్టి జరుగుతున్నా, అవన్నీ అసంఘటిత రంగంలోని ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలే. ఇలాంటి కొలువుల్లో తక్కువ వేతనాలు వస్తాయన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కరోనా మహమ్మారి కాలం ఈ అభద్రతను మరింత పెంచింది. కరోనా తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకున్నప్పటికీ, ఉపాధిరంగం మాత్రం ఇంకా తేరుకోలేదు. నైపుణ్యం ఉన్నవారు (చాలా తక్కువ మంది) టెక్, ఫైనాన్స్ తదితర రంగాల్లో స్థిరపడ్డారు. కానీ, గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లలో చాలామందికి ఉపాధి దొరకడం లేదు. లక్షల మంది తమ విద్యార్హతలతో సంబంధం లేని చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఇంకొంతమంది జీవనోపాధి దొరక్క శ్రామికవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. ఒకప్పుడు ఉద్యోగ, ఉపాధికి నిచ్చెన లాంటి విద్య.. ఇప్పుడు జీవనోపాధికి గ్యారెంటీ ఇవ్వనిదిగా మారడం బాధాకరం. పీహెచ్‌డీ చేసిన వ్యక్తి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎందుకు దరఖాస్తు చేస్తున్నాడనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలంటే జీతాన్ని కాదు, ఆ కొలువుకు ఉన్న గుర్తింపును చూడాలి. ప్రైవేటురంగంలో అస్థిరత నేపథ్యంలో దేశంలోని చాలా కుటుంబాలు ఉద్యోగ భద్రత వైపు మొగ్గుచూపుతున్నాయి. గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో సర్కారీ నౌకరీ అంటే జీవనోపాధి మాత్రమే కాదు, సమాజంలో గౌరవానికి అదొక చిహ్నం. పెన్షన్ లాంటి సామాజిక రక్షణలు లేకపోవడంతో ప్రైవేటు రంగంపై యువతలో ఆసక్తి తగ్గిపోతున్నది. ఎవరూ వాటిపై మక్కువ చూపడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసు లేదా మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగమంటే భవిష్యత్ అనిశ్చితిని రూపుమాపే భరోసాలాగా మారిపోయింది.మన దేశంలో విద్యావ్యవస్థల నుంచి బయటికొచ్చే ప్రొడక్ట్‌కు, ఉపాధి మార్కెట్ డిమాండ్‌కు మధ్య నిర్మాణాత్మక అసమతు ల్యత ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఇంజినీరింగ్, మేనేజ్ మెంట్, సాధారణ డిగ్రీ లాంటి ఉన్నత విద్య కోర్సులు బాగా విస్తృతమయ్యాయి. అయితే, ఇవి మన దేశ ఉపాధిరంగంతో సరితూగడం లేదు. విద్యాసంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పొంతనే ఉండటం లేదు. ఫలితంగా మనం గ్రాడ్యుయేట్ స్థాయి ఉద్యోగాల కంటే వేగంగా గ్రాడ్యుయేట్లను సృష్టిస్తున్నాం. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ గ్రాడ్యుయేట్లకు ఉపాధి చూపలేకపోతున్న మార్కెట్.. వారిని తమ అర్హత కంటే తక్కువ స్థాయి ఉద్యోగా లు చేసేలా మెడలు వంచుతున్నది. ఈ అసమతుల్యత ఆర్థిక పరమైన అంశాలను మించి ప్రభావాన్ని చూపుతున్నది. నిరా శను పెంచుతున్నది. ప్రభుత్వాలపై నమ్మకాన్ని తగ్గించడమే కాకుండా, ద్వేషాన్ని పెంచుతున్నది. ఏఐ, ఆటోమేషన్ మన వ్యవస్థలోకి వేగంగా దూసుకొస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్త ఉద్యోగాల సృష్టి మాత్రమే కాదు, ఏది సురక్షితమైన ఉపాధి అనేది నిర్వచించడమూ సవాలుగా మారుతున్నది. ఈ నేపథ్యంలో విద్య, పరిశ్రమలకు మధ్య వారధిగా ఉండే స్థిరమైన కార్మిక-మార్కెట్ వ్యూహం భారత్‌కు అవసరం. అత్యంత విషాదకరమైన అంశమేమిటంటే.. అత్యధిక అర్హత, ఉపాధికి సంబంధించిన ఈ కథనం సమీప భవిష్యత్తులోనూ మారకపోవచ్చు. ఒక కానిస్టేబుల్ పోస్టుకు 13 వేల మంది దరఖాస్తు చేయడాన్ని నిరాశ, నిస్పృహగా మనం చూడకూడదు. ఇది జీవనోపాధి, గుర్తింపు కోసం చేస్తున్న పోరాటానికి ప్రతీక. ఈ ఆర్థిక వ్యవస్థలోకి దూరేందుకు పట్టభద్రులైన నిరుద్యోగులు ఇంకా సర్కారీ కొలువుల కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారనడానికి తార్కాణం.

# తాలిబన్‌లతో సఖ్యత!

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులుండరన్న నానుడి దౌత్యానికి కూడా వర్తిస్తుంది. పైకి ఏం చెబుతున్నా, ఇతరేతర ప్రత్యామ్నాయాల సాధ్యాసాధ్యాలను పరిశీలించటమనే ప్రక్రియ దౌత్యంలో నిరంతరం కొనసాగుతుంటుంది. పర్యవసానంగా ఒక్కోసారి అనూహ్య పరిణామాలు కూడా చోటుచేసుకోవచ్చు. తాలిబన్‌ల ఆధ్వర్యంలోని అఫ్ఘానిస్తాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీ గురువారం అయిదు రోజుల భారత సందర్శనకు రావటం అటువంటిదే. ఇది దక్షిణ, మధ్య ఆసియా భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేసే పరిణామం. ప్రపంచ దేశాల్లో రష్యా మినహా మరే దేశమూ ఇంతవరకూ అఫ్ఘాన్ ప్రభుత్వాన్ని లాంఛనంగా గుర్తించలేదు. మన దేశం తొలిసారి ఆ దిశగా అడుగులేస్తున్నది. అమీర్ ఖాన్ రానున్న సంద ర్భంగా తాలిబన్‌ను ప్రాంతీయ బృందంలోని భాగస్వామిగా గుర్తించటానికి భారత్ సిద్ధపడింది. తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించటం ఇక లాంఛన ప్రాయం. భద్రతా మండలి ఉగ్రవా దులుగా గుర్తించి ఆంక్షలు విధించిన వారిలో అమీర్ ఖాన్ ఒకరు. దానికింద ఆయన తారసపడితే అరెస్టు చేయాల్సి ఉం టుంది. భారత్ చొరవతో ఈ విషయంలో తాత్కాలికంగా మిన హాయింపు లభించింది. తొలిసారి 1996లో అఫ్ఘాన్ తాలిబ న్‌ల వశమైనప్పుడు మనకు ఎన్ని విధాల సమస్య లొచ్చాయో ఎవరూ మరిచిపోరు. సోవియెట్ దురాక్రమణను ప్రతిఘటించి పాలనాధి కారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబన్‌లు అనేకమంది మిలిటెంట్లను కశ్మీర్‌కు తరలించారు. పర్యవసా నంగా అక్కడ నెత్తురుటేర్లు పారాయి. కేంద్రంలో వాజ్‌పేయి నాయ కత్వాన తొలి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక 1999లో ఉగ్రవాదులు ఖాట్మండు నుంచి న్యూఢిల్లీ వచ్చే విమానాన్ని హైజాక్ చేసి అఫ్ఘాన్‌లోని కాందహార్‌కు తరలించారు. ముగ్గురు ఉగ్రవాదుల్ని విడిపించుకున్నారు. ఈ చర్య వెనక నేరుగా తాలిబన్‌లు లేక పోయినా ఉగ్రవాదులు సురక్షితంగా వెళ్లటానికి సహకరించారు. తాలిబన్‌లతో చర్చలు గానీ, గుర్తింపుగానీ ఉండబోదని అప్పట్లో మన దేశం ప్రకటిం చింది. ఇంటా, బయటా వారు సాగిస్తున్న అరాచకాలను తీ వ్రంగా ఖండించేది. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా 2001లో అఫ్ఘాన్‌ను దురాక్రమించాక ఏర్పడిన ప్రభుత్వాలకు మన దేశం మద్దతుగా నిలిచింది. 2021లో తాలిబన్‌ల పునరాగమనంతో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వం పడిపోయేవరకూ మన దేశం పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేప ట్టింది. రూ. 25,000 కోట్ల వ్యయంతో పార్లమెంటు భవనా న్నీ, సల్మా ఆనకట్టనూ, ఒక జాతీయ రహదారినీ నిర్మించింది. విద్యుదు త్పాదన ప్రాజెక్టులు, విద్య, వైద్యం తదితరాల్లో పాలుపంచు కుంది. ఇవన్నీ తాలిబన్‌లలో సద్భావన కలిగించటంతో పాటు పాకిస్తాన్‌తో వచ్చిన విభేదాలు కూడా వారిని భారత్‌వైపు మొగ్గేలా చేశాయి. పాక్- అఫ్ఘాన్ దీర్ఘకాల సంబంధాలూ, ఉజ్బెకిస్తాన్ ద్వారా సన్నిహితం కావటానికి పాక్ చేస్తున్న ప్రయత్నాలూ, చైనా వరస మంతనాలూ మన దేశంలో కూడా పునరాలోచన కలిగించాయి. మనం ముందడుగు వేయన ట్టయితే ఏదోనాటికి తాలిబన్%-%పాకిస్తాన్ సంబంధాలు మెరుగుపడి, చైనా పలుకుబడి పెరిగి అది మన భద్రతకు ముప్పు కలిగించే అవకాశం కూడా ఉంటుంది. పైగా అమె రికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యూహాత్మకంగా కీలకమైన అఫ్ఘాన్‌లోని బగ్రాం వైమానిక స్థావరాన్ని తమకు అప్పగిం చాలని కోరుతున్నారు. ఇది కూడా మన భద్రతను ప్రశ్నార్థకం చేసే పరిణామం. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోబట్టే తాలిబన్‌లతో సత్సంబంధాలకు మన దేశం సిద్ధపడింది. ఏ దేశానికైనా స్వీయ ప్రయోజ నాలు, భద్రత అత్యంత కీలకం. ఆ తర్వాతే మిగిలిన వన్నీ. గత నాలుగేళ్లుగా మన దేశం వేలాది టన్నుల గోధుమలు, వందల టన్నుల మందులు, వ్యాక్సిన్లు, భారీ మొత్తంలో పురుగుమందులు, అత్యవసర సరు కులు పంపింది. ఇటీవల భూకంపం వచ్చినప్పుడు టెంట్లు, మందులు, దుప్పట్లు, జనరే టర్లు అందించింది. కాబూల్‌లో పూర్తిస్థాయి దౌత్య కార్యాల యం కాకపోయినా సాంకేతిక కార్యాలయాన్ని తెరిచింది. తాలిబన్ ప్రభుత్వం ఢిల్లీలో రాయబార కార్యాలయం ప్రారంభించుకోవటానికి అనుమతి నిచ్చింది. ఈ అనుకూల వాతావరణంలో అఫ్ఘాన్‌తో సత్సంబం ధాలకు ప్రయత్నించటం అనేక విధాల శుభ పరిణామం.

## సమాచార హక్కు చట్టం- పారదర్శకత

భారత ప్రజాస్వామ్య చరిత్రలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలపరుస్తూ ప్రజలకు పాలనపై ప్రశ్నించే అధికారం కల్పించిన చట్టం సమాచార హక్కు చట్టం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్న మౌలిక సూత్రానికి న్యాయం చేస్తూ, ఈ చట్టం దేశ ప్రజలకు ఒక విప్లవాత్మక సాధనంగా మారింది. భారత పార్లమెంటు ఆమోదంతో రూపొందిన ఈ చట్టం 2005 జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం పొందగా, 120వ రోజు అయిన అక్టోబర్ 12, 2005న దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆ రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ నూతన అధ్యాయంగా నిలిచి పోయింది. సమాచార హక్కు చట్టం పుట్టుక వెనుక ప్రజా ఉద్యమాల సుదీర్ఘ పోరాటం ఉంది. రాజస్థాన్ రాష్ట్రంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వంటి సామాజిక సంస్థలు ప్రభుత్వ ఖాతాల పారదర్శకత కోసం చేసిన పోరాటం ఈ చట్టానికి పునాది వేసింది. “ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నడుస్తుంది, కాబట్టి ప్రజలకు లెక్క చెప్పాల్సిందే” అనే నినాదంతో ప్రారంభమైన ఆ ఉద్యమం దేశవ్యాప్త చైతన్యానికి దారితీసింది. చివరికి యూపీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమాచార హక్కు బిల్లును రూపొందించి పార్లమెంటులో ఆమోదింప జేసింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం... ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడం. ప్రభుత్వ నిర్ణయాలు, ఫైళ్లు, కాంట్రాక్టులు, టెండర్లు, ఖర్చులు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా అవినీతి తగ్గించడం, ప్రజా నిధుల వినియోగాన్ని సక్రమంగా పర్యవేక్షించడానికి ప్రజలకు అవకాశం కల్పించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కింద పౌరులకు ఇచ్చిన మాటల స్వేచ్ఛలో భాగంగానే సుప్రీంకోర్టు సమాచార హక్కును మౌలిక హక్కుగా పరిగణించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం నుండి సమాచారాన్ని అడిగే చట్టబద్ధ హక్కు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత వహించాలి. దరఖాస్తు లిఖిత పూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. సాధారణంగా సమాచారం ఇవ్వడానికి 30 రోజులు గడువు ఉంటే, జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 48 గంటల్లోపే సమాధానం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే లేదా నిరాకరించినట్లయితే సంబంధిత అధికారిపై రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించే అవకాశం చట్టంలో ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు దీన్ని శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, భూముల రికార్డులు, విద్యా నియామకాలు, స్థానిక సంస్థల ఖర్చులు వంటి అనేక అంశాల్లో పౌరులు సమాచారాన్ని కోరారు. అనేక అవినీతి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రలో భూసంబంధిత అవినీతి కేసులు, ఢిల్లీలో పాఠశాల భవనాల నిర్మాణంలో జరిగిన మోసాలు, బడ్జెట్ వినియోగాల్లో గోప్యతల ఉల్లంఘనలు ఈ చట్టం ద్వారానే బహిర్గతమయ్యాయి. ప్రజల చేతుల్లో ఈ చట్టం నిజమైన ప్రజాస్వామ్య పరికరంగా మారింది. చట్టం అమలుకు సంబంధించి కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి. సమాచారం ఇవ్వని అధికారులను ప్రశ్నించడం, ప్రజల పిటిషన్లను విచారించడం వీటి బాధ్యత. తొలి కేంద్ర సమాచార కమిషనర్ వాజహత్ హబీబుల్లా కాగా, అనేక రాష్ట్రాల్లోనూ ఇలాంటి కమిషన్లు ఏర్పాటయ్యాయి. ఈ కమిషన్లు పౌరుల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను తీసుకు రావడంలో విశేష పాత్ర పోషించాయి. 2019లో చట్టంలో జరిగిన సవరణలతో కమిషనర్ల పదవీకాలం, వేతనాల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడింది. ఈ మార్పులు పారదర్శకతను బలహీన పరిచే అవకాశం ఉందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఇంకా ప్రభావవంతమైన సాధనంగానే ఉంది. అయితే దాని వినియోగం తగ్గిపోవడం, సమాచారం ఇవ్వడంలో ఆలస్యం, కొన్నిసార్లు సమాచారం కోరిన వ్యక్తులపై దాడులు జరగడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల కంటిచూపును నిలబెట్టే వ్యవస్థ ఇది. ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని తెలుసుకొని వినియోగించాలి. అక్టోబర్ 12, 2005న భారత ప్రజాస్వామ్యం మరింత బలపడిందిబీ ప్రజల చేతిలో ఒక పెన్నుతో సత్యాన్ని వెలికితీసే శక్తి అప్పగించబడిన రోజు అది.

# గంధం ఆ చర్మ సమస్యలకు వరం..



ఆయుర్వేదంలో గంధాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. మొఖంపై మొటిమలను నివారించడానికి, తళతళ మెరిసేందుకు గంధాన్ని ఉపయోగిస్తారు. గంధం పొడి, పేస్ట్ లేదా నూనె రూపంలో ఉపయోగించవచ్చు. ఈ ప్రకృతి సహజసిద్ధమైన పదార్థం చర్మాన్ని సంరక్షించి మెరిసేలా చేస్తుందని నిపుణులు అంటుంటారు. ఈ గంధం ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మొటిమలను దూరం చేస్తుంది: గంధం చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. చర్మాన్ని అలర్జీల నుంచి రక్షించి మొటిమలను దూరం చేస్తుంది. ఒక టీస్పూన్ గంధం నూనె, చిటికెడు పసుపు, కర్పూరం కలిపి ముఖానికి ప్యాక్ లాగా రాసుకోవాలి. రాత్రాంత అలాగే ఉంచి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేస్తే మొటిమలు, నల్లమచ్చలు పోతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది: తేలికపాటి ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాల వల్ల చందనం.. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఇది మీ చర్మంపై నల్ల మచ్చలను పోగొట్టడానికి సహాయపడుతుంది. టాన్ తొలగించడానికి ఇది సమర్థవంతమైనది. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ గంధం పొడి, కొబ్బరి నూనె కలపాలి. దీన్ని ముఖానికి పూసుకుని.. మసాజ్ చేసి రాత్రంతా అలాగే ఉంచాలి. డార్క్ స్పాట్స్ వదిలించుకోవడానికి, రెగ్యులర్ టాన్ పొందడానికి దీన్ని రెగ్యులర్‌గా ఉపయోగిస్తే మచ్చలు పోయి.. ముఖం తళతళ మెరుస్తుంది. వృద్ధాప్యానికి చెక్: గంధపు చెక్కలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఇది చర్మ ముడుతలను నివారించి వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. దీంతోపాటు చర్మాన్ని కాంతివంతంగా యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. దీని కోసం, 2 టేబుల్ స్పూన్ల ముల్తానీ మట్టి, 2 టేబుల్ స్పూన్ల గంధం కలపి రాయాలి. 15-20 నిమిషాలు అలాగే ఉంచి నీటితో కడిగితే చాలు. పొడి చర్మం నివారణ: చాలా మంది పొడి, నిర్జీవమైన చర్మంతో బాధపడుతుంటారు. అలాంటివారు చందనం ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల పొడి, నిర్జీవమైన చర్మానికి చెక్ పెట్టవచ్చు. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ పాలపొడి, కొన్ని చుక్కల గంధం నూనె, రోజ్ వాటర్ కలిపి ముఖానికి రాయాలి. 15 నిమిషాలు ఉంచి నీటితో కడిగితే చర్మం నిగారింపుగా మారుతుంది. జిడ్డుగల చర్మం: జిడ్డుగల చర్మంపై తరచుగా ధుమ్ము, ధూళి పేరుకుపోతుంది. అలాంటివారికి చందనం దివ్య ఔషధంలా పనిచేస్తుంది. ఒక గిన్నెలో అర టీస్పూన్ గంధం పొడి, కొంచెం టమోటా రసం, అర టీస్పూన్ ముల్తానీ మట్టి వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖంపై పూసుకొని..15 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మెరుస్తూ ఉంటుంది.

# పాదాల తిమ్మిర్లు ఉంటే అనారోగ్యానికి సంకేతం



పాదాల వాపులు వస్తున్నాయంటే తప్పనిసరిగా జాగ్రత్తపడాల్సి ఉంటుంది. నిజానికి చాలా మంది ఈ లక్షణాలను పెద్దగా పట్టించుకోరు. వాపులు, తిమ్మిర్లు తగ్గడానికి తాత్కాలికంగా మందులు వేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ ఈ చిన్న సమస్యలే చాలా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే..వీలైనంత త్వరగా స్పందించాలి. మరి ఇలా పాదాల్లో జరిగే మార్పులు ఏయే రోగాలకు సంకేతాలు.

పాదాల ఆరోగ్యాన్ని చాలా మంది పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇవే క్రమంగా పెద్దవై ముప్పు తెచ్చి పెడతాయి. చర్మం రంగు మారడం నుంచి తిమ్మిర్లు ఎక్కడం వరకూ ఎన్నో రకాలుగా సమస్యలు వస్తాయి. నడిచేటప్పుడు కూడా ఈ మార్పులు స్పష్టంగా కనబడతాయి. అలాంటప్పుడే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించడం మంచిది. ఏ మాత్రం ఆలస్యం చేసినా కండీషన్ సీరియస్ అయ్యే ముప్పు ఉంటుంది. నిజానికి పాదాల్లో ఇలాంటి మార్పులు వస్తున్నాయంటే ఎన్నో తీవ్ర అనారోగ్యాలకు ఇవి సంకేతాలు కావచ్చు అని పలు అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు ఇదే విధంగా ఉంటాయి. పాదాల్లో మంట, కురుపులు రావడం లాంటి లక్షణాలు రక్త సరఫరా సరిగ్గా లేనప్పుడు కనబడతాయి. ముఖ్యంగా నరాలు డ్యామేజ్ అయినప్పుడు కూడా పాదాల్లో ఇలాంటి మార్పులు కనిపించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

పాదాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చినప్పుడు కూడా రంగు మారేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాపులను మాత్రం తప్పనిసరిగా గమనించాలి. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినప్పుడు, వీటి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఇలా పాదాల్లో వాపులు వస్తాయి. సరైన సమయానికి సరైన వైద్యం అందించకపోతే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ తిమ్మిరిగా ఉండడం, దురద లాంటి లక్షణాలు కనిపించాయంటే అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. లేదా నరం డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ అసలు కంట్రోల్ లో లేనప్పుడు ఇలా జరుగుతుంది. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఇంకేదైనా న్యూరో సమస్యలు తలెత్తినప్పుడు ఇలా పాదాల్లో తిమ్మిర్లు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే..ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలా త్వరగా స్పందించాల్సి ఉంటుంది. లేదంటే ఈ సమస్య కాస్త తీవ్ర ఇన్ఫెక్షన్ కి దారి తీసే ప్రమాదం ఉంది. పాదాల్లో విపరీతమైన నొప్పి, వాపులు వస్తుంటాయి. పాదాలు చాలా బరువెక్కినట్టుగా అనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు లెక్క. దీన్నే ఎడిమా అంటారు. ముఖ్యంగా హార్ట్ ఫెయిల్యూర్ కండీషన్స్ లో ఈ సమస్య తలెత్తుతుంది. గుండె కండరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఇలాగే పాదాల్లో వాపులు కనిపిస్తాయి. పాదాల్లో ఎక్కువగా కదలికలు వచ్చే కొద్దీ ఈ వాపులు ఎక్కువవుతుంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడినా, ఎక్కువ సేపు కూర్చున్నా వాపులు మరీ ఎక్కువవుతాయి. ఇలాంటి సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే లక్షణాలు మరీ తీవ్రమవుతాయి. పాదాలపై చర్మం పొడిగా మారడం, చర్మం రంగు మారిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఏదైనా గాయం అయినప్పుడు ఎక్కువ రోజుల పాటు మానకుండా అలాగే ఉన్నా అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. కొన్ని సార్లు ఈ అల్సర్స్ చాలా తీవ్రమవుతాయి. త్వరగా చికిత్స తీసుకుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# గుండెని పదిలంగా ఉంచే సీక్రెట్ ఈ ఆహారాలను మానేయండి!



గుండె ఆరోగ్యానికి హానికరమైన ఆహారాలు - మీరు తప్పక దూరంగా పెట్టాల్సినవి1. అధిక సంతృప్త కొవ్వు పదార్థాలు:కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచే అధిక సంతృప్త కొవ్వులు గుండె జబ్బులకు కారణమవుతాయి. ముఖ్యంగా గొడ్డు మాంసం, గొర్రె మాంసం, పంది మాంసం వంటివి పరిమితంగా తీసుకోవాలి. 2. తక్కువ కొవ్వు దినుసుల ఎంపిక:మొత్తం కొవ్వు మోతాదును తగ్గించేందుకు తక్కువ కొవ్వు పాలు, పెరుగు, జున్ను వంటివి ఎంచుకోండి. వెన్న స్థానంలో ఆలివ్ నూనె లేదా కూరగాయల నూనె ఆధారిత స్ప్రెడ్‌లను వాడటం మెరుగైన ఎంపిక. 3. ప్రాసెస్ చేసిన మరియు వేయించిన ఆహారాలు:బేకన్, సలామీ, హామ్, పాస్ట్రామి వంటి ప్రాసెస్ చేసిన మాంసాన్ని మరియు ఫ్రెంచ్ ఫ్రైస్, ఫ్రైడ్ చికెన్, డోనట్స్ వంటి వేయించిన ఆహారాలను తగ్గించండి. ఇవి అధికంగా సోడియం, కొవ్వు మరియు కేలరీలను కలిగి ఉంటాయి. తక్కువ ఉప్పుతో ఉండే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. 4. చక్కెర మరియు సోడియం అధికంగా ఉండే పదార్థాలు:సోడా వంటి చక్కెర పానీయాలు బరువు పెరగడాన్ని, రక్తపోటును పెంచడాన్ని ప్రేరేపిస్తాయి. అలాగే కుకీలు, కేకులు, మఫిన్లు వంటివి కూడా పరిమితంగా తీసుకోవాలి. డబ్బాబందీ పదార్థాలు, ప్రాసెస్ చేసిన మాంసాలు వంటివి ఎక్కువగా సోడియం కలిగి ఉంటాయి, వాటినీ తగ్గించండి. 5. గుండెకు మేలు చేసే ఆహారాలు:విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ అధికంగా ఉండే రంగురంగుల పండ్లు మరియు కూరగాయలు ఆహారంలో చేర్చుకోండి. అలాగే బ్రౌన్ రైస్, క్వినోవా, తృణధాన్యాల బ్రెడ్ వంటి ఫైబర్ అధికంగా ఉండే తృణధాన్యాలను ఎంచుకోండి. 6. లీన్ ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు:స్కిన్‌లెస్ చికెన్, చేపలు, పప్పులు వంటివి మంచి లీన్ ప్రోటీన్ వనరులు. ఇవి సంతృప్త కొవ్వు తక్కువగా కలిగి ఉంటాయి. అలాగే ఆలివ్ ఆయిల్, అవకాడో, గింజలు వంటి వాటిలో గుండెకు మేలు చేసే కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

# తెల్లజుట్టు సమస్యకు వంటింటి చిట్కా



జుట్టు తెల్లబడటం అనేది నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని బాధిస్తున్న ఒక సాధారణ సమస్య. మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యకు మన వంటింట్లోనే ఒక అద్భుతమైన మరియు సహజసిద్ధమైన పరిష్కారం ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అదే, సొరకాయ ఉపయోగించి తయారుచేసే ప్రత్యేకమైన నూనె. ఈ పురాతన చిట్కా జుట్టుకు పోషణనిచ్చి, దాని సహజసిద్ధమైన నలుపు రంగును తిరిగి తీసుకురావ డానికి సహాయపడుతుంది. జుట్టు నల్లబడటానికి సొరకాయ నూనెను తయారుచేసే పద్ధతి చాలా సులభం. ముందుగా, సొరకాయను చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఈ ముక్కలను కనీసం వారం రోజుల పాటు బాగా ఎండబెట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల సొరకాయలోని తేమ పూర్తిగా తొలగిపోయి, దాని పోషక విలువలు నూనెలోకి చేరడానికి సిద్ధమవుతాయి. ఇలా ఎండిన ముక్కలను ఒక మందపాటి పాత్రలో తీసుకోవాలి. తరువాత, ఈ ఎండిన సొరకాయ ముక్కలకు సరిపడా మంచి నాణ్యత గల కొబ్బరి నూనెను (ఎఱతీస్త్రఱఅ జశీఝశీఅబ్ నాఱశ్రీను వాడటం ఉత్తమం) జోడించాలి. ఈ మిశ్రమాన్ని మంటపై ఉంచి, సొరకాయ ముక్కలు రంగు మారే వరకు లేదా ముక్కలు పూర్తిగా నూనెలో కలిసిపోయినట్లు అయ్యే వరకు తక్కువ మంటపై బాగా మరిగించాలి. ఇలా మరిగించడం వల్ల సొరకాయలోని కీలకమైన పోషకాలు మరియు సహజ వర్ణకాలు నూనెలోకి పూర్తిగా విడుదలవుతాయి. అనంతరం, ఆ నూనెను చల్లార్చి, ఒక శుభ్రమైన వడపోత గుడ్డ సహాయంతో వడబోసి, గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ ఇంట్లో తయారుచేసిన సొరకాయ నూనెను వారానికి కనీసం ఒకసారి తలకు పట్టించి, వేళ్ళతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా ఉంచి, మరుసటి రోజు ఉదయం మైల్డ్ షాంపూతో తలస్నానం చేయడం వల్ల ఉత్తమ ఫలితం ఉంటుంది. ఇలా తరచుగా చేయడం వలన జుట్టు కుదుళ్ళు బలం పుంజుకుంటాయి, జుట్టు నల్లబడటం ప్రారంభమవుతుంది. రసాయనాలు లేని ఈ సహజసిద్ధమైన చికిత్స జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, తెల్లజుట్టు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపడంలో సహాయపడుతుంది.

## మిగిలిన అన్నం లాభాలు తెలిస్తే నోరెళ్లబెడతారు!



చద్దన్నం (చలి అన్నం లేదా మిగిలిపోయిన అన్నం) తినడం చాలా మందికి ఇష్టం ఉండదు. కొందరు చద్దన్నాన్ని ఇష్టంగా తింటే మరికొంత మంది మాత్రం అస్సలే దానిని తినడానికి ఆసక్తి చూపరు. కానీ చద్దన్నం తినడం వలన కూడా బోలెడు లాభాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. భారతీయుల్లో చాలా మంది తమ ఇంట్లో అప్పటికప్పుడు వండిన వేడి వేడి అన్నం తినడానికే ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తుంటారు. ఎందుకంటే ఇది రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి మంచిది. అయితే వేడి వేడి అన్నమే కాదండోయ్, మిగిలిపోయిన అన్నం తినడం వలన కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయంట. చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఎలా అంటే? బియ్యాన్ని ఉడికించి, దానిని చల్లబరిచినప్పుడు అందులో ఉండే కొంత పిండి పదార్థం, స్టార్చ్ రిట్రోగ్రేడేషన్ అనే ప్రక్రియ ద్వారా నిరోధక పిండి పదార్థంగా మారి, జీర్ణక్రియ నిరోధకతను కలిగి ఉంటుందంట. అందువలన ఇది రక్తంలోకి గ్లూకోజ్‌ను చాలా మెల్లగా విడుదల చేయడం వలన అప్పటికప్పుడు వండిన అన్నం కంటే, చలి అన్నం తినడం వలన డయాబెటీస్ కంట్రోల్‌లో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. దీనిపై పరిశోధకులు తాజాగా ఓ సర్వే కూడా జరపగా, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తున్నట్లు వారు కనుగొన్నారు. 15 మంది ఆరోగ్యకరమైన పెద్ద వారిని తీసుకొని, తెల్ల బియ్యాన్ని ఉడికించి, 4ళీ%జ% వద్ద 24 గంటలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి, ఆపై మళ్లీ వేడి చేసి తినడం వలన, అప్పటికప్పుడే వండి తినే అన్నం కంటే, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గేలా చేసిందంట. అందువలన చద్దన్నం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ఇది ప్రీ బయోటిక్ గా పని చేయడమే కాకుండా, గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. పెద్ద పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అదే విధంగా ఇన్సులిన్ సెన్సిటివిటీకి సంబంధించిన హార్మోన్స్ ను ప్రభావితం చేస్తుందంట. ఆకలిని తగ్గించి, పొట్టలోని బ్యాడ్ కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది. బరువు తగ్గాలి అనుకునే వారికి, మధుమేహం సమస్యతో బాధపడే వారికి ఇది మంచి ప్రయోజనం. చల్లగా మిగిలిపోయిన అన్నం తినడం మంచిది ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది, ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర పెరుగుదలను తగ్గించడంలో,కడుపు నిండిన అనుభూతిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

# శక్తి తరగకుండా ఉండాలంటే ఈ డైట్ పాటించండి!



నలభై ఏళ్లు దాటిన మహిళల శరీరంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. హార్మోన్ల సమతుల్యతలో మార్పులు, జీవక్రియ (మెటబాలిజం) మందగించడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి కారణాల వల్ల గతంలో ఉన్నంత ఉత్సాహం, శక్తి తరచుగా తగ్గిపోతుంటాయి. ఎంత సమయానికి తింటున్నా కొన్నిసార్లు నీరసం, అలసట చుట్టుముట్టవచ్చు. ఈ దశలో, కేవలం ఆహారం తీసుకోవడం సరిపోదు. శరీరానికి తగిన పోషకాలు అంది, శక్తిని కాపాడుకోవడానికి సమతుల్యమైన (బ్యాలెన్స్‌డ్) ఆహార విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. నిపుణులు కూడా దీనినే గట్టిగా సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా అందాలంటే, ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వివిధ రంగుల్లో ఉండే పండ్లు, ఆకుకూరలు యాంటీఆక్సిడెంట్లను అందించి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖ్యంగా, ఎముకల బలం కోసం కాల్షియం, విటమిన్ డి అవసరం. వీటితో పాటు రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను కూడా డైట్‌లో చేర్చుకోవాలి. ఈ పవర్‌హౌస్ లాంటి ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. 40 ఏళ్లు పైబడిన తర్వాత, కండరాల క్షీణతను నివారించడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అందుకే, ఆహారంలో పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, పన్నీర్), అలాగే మాంసాహారం, గుడ్లు వంటి వాటిని తగిన మోతాదులో చేర్చుకోవాలి. పాల ఉత్పత్తులు కాల్షియంను అందిస్తే, మాంసాహారం, గుడ్లు నాణ్యమైన ప్రోటీన్‌ను అందిస్తాయి. శాఖాహారులు పప్పులు, చిక్కుళ్లు, సోయా వంటి వాటిని తీసుకోవడం ద్వారా ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఈ కీలకమైన పోషకాలు శరీరాన్ని దృఢంగా ఉంచి, రోజంతా శక్తివంతంగా ఉండేలా చేస్తాయి. శక్తి స్థాయిలను మెరుగుపరచుకోవడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పీచు పదార్థాలు (ఫైబర్) ఉన్న ఆహారాన్ని డైట్‌లో పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎంత మంచి ఆహారం తీసుకున్నా, శరీరం హైడ్రేటెడ్‌గా (సరిపడా నీటితో) ఉండటం చాలా అవసరం. అందుకే, తరచుగా, సరిపడా నీటిని తాగాలి. తగినంత నీరు తాగడం వల్ల నీరసం తగ్గుతుంది, జీవక్రియ సక్రమంగా పనిచేస్తుంది. ఈ మార్పులను పాటించడం ద్వారా 40 ప్లస్ మహిళలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

-మొదటిపేజీ తరువాయి

తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

హామీలన్నీ మోసమే...!

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు,



అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

**బీజేపీపైనా విమర్శలు**

ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ

## ఎస్సారెస్పీ-2కి ఆర్‌డీఆర్

-మొదటిపేజీ తరువాయి

సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి సేవలని నేతలు గుర్తుకుచేసుకున్నారు.

## 'రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

-మొదటిపేజీ తరువాయి

చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..'రేపు ఢిల్లీకి వెళ్తాం. సుప్రీంకోర్టు తలుపు తడుతాం. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు మేం భయపడం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై మా చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు. బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై వెనక్కి తగ్గేది లేదు. బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగులో ఉన్నాయి. ప్రధాని దగ్గరికి వెళ్ళి బీజేపీ నాయకులు ఎందుకు అడగడం లేదు?. బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిస్తే మద్దతు ఇస్తాం. బీసీ సంఘాలు ధర్నా చేసినప్పుడు ఈటల, సంజయ్ ఎక్కడ దాక్కున్నారు?. బీజేపీ నరనరాన బీసీ వ్యతిరేక పార్టీ. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది అంటూ విమర్శలు చేశారు.

అలాగే,

**ఆర్టీఐపై కీలక వ్యాఖ్యలు..**

నేటితో ఆర్టీఐ చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ళు అయిన సందర్భంగా స్పందిస్తూ.. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం, సోనియా గాంధీ దూరదృష్టి నాయకత్వంలో చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12న అమలులోకి వచ్చింది. దేశ చరిత్రలో ఆర్టీఐ చారిత్రాత్మక నిర్ణయం. ప్రజలకి వాస్తవాలను తెలుసుకోవడానికి మహత్తర అవకాశం ఆర్టీఐ ద్వారా కల్పించారు. ప్రజలకు ఆర్టీఐ జీవన రేఖగా మారింది. ఈ చట్టం ప్రజలకు ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని తీసుకొచ్చింది. 2014 నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్టీఐకి తూట్లు పొడుస్తోంది. 2019 సవరణలతో సమాచారం కమిషన్ల స్వతంత్రతను బలహీనపరిచాయి. కమిషనర్ల పదవీకాలం (5 సంవత్సరాలు), సేవా షరతులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేలా మార్పులు జరిగాయి. స్వయం ప్రతిపత్తితో నిర్వహించే ఆర్టీఐ కమిషనర్లు కేంద్రం ఒత్తిడిలకు తల్లోగే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర సమాచారం కమిషన్ ప్రస్తుతం 11 పోస్టులకు బదులుగా కేవలం ఇద్దరు కమిషనర్లతోనే పనిచేస్తోంది. 2025 సెప్టెంబర్ తర్వాత చీఫ్ కమిషనర్ పదవి కూడా ఖాళీగా ఉంటుంది. ఇంతకంటే దుర్మార్గం లేదు. కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధింపులకు గురవుతున్నారు. 2019 సవరణలను రద్దు చేసి కమిషన్ల స్వతంత్రతను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర కమిషన్లలో ఖాళీలను తక్షణమే పారదర్శకంగా భర్తీ చేయాలి. కమిషన్ల పనితీరుపై నిర్దిష్ట ప్రమాణాలు, ప్రజా నివేదికలు తప్పనిసరి చేయాలి' అని డిమాండ్ చేశారు.

## గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఉద్రిక్తత.. రోగి మృతితో బంధువుల ఆందోళన

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రి వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాలేయ మార్పిడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. భారీగా డబ్బులు వసూలు చేసి, చివరికి ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, కుత్బుల్లాపూర్‌కు చెందిన మురళీధర్ (40) కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం 45 రోజుల క్రితం ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. కాలేయ మార్పిడి అవసరమని వైద్యులు చెప్పడంతో, అవయవదానం కోసం జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, మురళీధర్ వయసు 40 ఏళ్లు కాగా, ఆసుపత్రి సిబ్బంది పొరపాటున 60 ఏళ్లుగా నమోదు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ తప్పిదం వల్ల అవయవదాతలు ఎవరూ ముందుకు రాలేదని, దీంతో చివరికి అతని భార్యే కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకొచ్చారని వారు తెలిపారు.

# జేబులు గుల్లా?

**కరీంనగర్ :** స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాష్ట్ర సర్కారు చేసిన ఆగానికి ఆశావహుల జేబులు గుల్లా అయ్యాయి. ఒకరిద్దరు కాదు.. ప్రభుత్వం చూపించిన అశల సవ్వడిలో ఓలయాడిన వేలాది మంది తమ సామర్థ్యానికి మించి ఇప్పటికే ఖర్చు చేశారు. నామినేషన్లు, ఎన్నికలకు అత్యంత తక్కువ సమయం ఉండడంతో.. రిజర్వేషన్లు ఖరారు కాగానే.. ఖర్చుల ప్రక్రియ ఆరంభం కాగా.. ఇందులో ఎక్కువ శాతం బీసీ అభ్యర్థులే నష్టపోయారు. ప్రభుత్వ మాటలు నమ్మి.. 42 శాతం రిజర్వేషన్ల ద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్న ఆకాంక్షతో బరిలోకి దిగిన బీసీ అభ్యర్థులు పెట్టిన ఖర్చులు ఇప్పుడు బూడిదలో పోసిన పన్నీరు అయిందన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

"జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు భయపడాల్సిన పనిలేదు. 2029 వరకు మీకు మీ పదవులకు ఎలాంటి ఢోకా లేదు. నిరభ్యంతరంగా మీరు నామినేషన్ వేసి పోటీ చేయొచ్చు. మీ పదవీ కాలం ముగిసేవరకు పూర్తి గ్యారెంటీ ప్రజా ప్రభుత్వమే తీసుకుంటుంది. కాబట్టి, నిరభ్యంతరంగా పోటీ చేసి గెలవండి. గెలిచిన అభ్యర్థుల పదవులు మధ్యలోనే పోతాయని అపోజిషన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేసే దుష్ప్రచారాలు నమ్మొద్దు. నిస్సందేహంగా మీరు పోటీ చేయండి. పోటీ చేసి గెలిచిన అభ్యర్థులకు ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సపోర్ట్ పుష్కలంగా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో సర్కారు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఒకవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోపై హైకోర్టులో కేసు నడుస్తుండగానే.. రిజర్వేషన్లు ప్రకటించడం, నోటిఫికేషన్ జారీచేయడం.. అక్కడితో ఆగకుండా.. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి తేదీలను ప్రకటించడం వంటివి ఆగమేఘాల మీద చేసింది. ఆర్భాటపు ప్రచారం చేసి.. ఎన్నికలు ఖచ్చితంగా జరుగుతాయనే భ్రమను కల్పించింది. ఒకవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవో న్యాయస్థానాల్లో నిలువదని న్యాయనిపుణులు, రాజకీయ విశ్లేషకులు పదేపదే చెప్పినా.. హస్తం పార్టీ, ప్రభుత్వం ఏమాత్రం వినకుండా.. ముందుకు వెళ్లింది. ఆ మేరకు.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడుత నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఈనెల 9 నుంచి 11 వరకు అలాగే, రెండో విడుత ఈ నెల 13 నుంచి 15 వరకు స్వీకరించడానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఆ మేరకు మొదటి విడుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఈ నెల 23న, రెండో విడుత 27న జరిగేలా షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అలాగే, గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడుతల్లో నిర్వహించాలని నిర్ణయించగా.. ఉమ్మడి జిల్లాలో మొదటి విడుత నామినేషన్లు ఈ నెల 17 నుంచి 10 వరకు, రెండో విడుత ఈ నెల 21 నుంచి 23 వరకు, మూడో విడుత ఈ నెల 25 నుంచి 27 వరకు స్వీకరించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. సర్పంచ్ మొదటి విడుత ఎన్నికలు ఈ నెల 23న, రెండో విడుత 27న, మూడో విడుత వచ్చేనెల 8న నిర్వహించేందుకు ఆదేశాలు విడుదలయ్యాయి. ముందుగా రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రకటనలు జారీ కావడం.. ఆ వెంటే షెడ్యూల్ విడుదల కావడం.. ఆ తదుపరి నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికలు ఎట్టి పరిస్థితుల్లో వాయిదా పడే ప్రసక్తే లేదన్నట్లుగా ప్రభుత్వం హడావుడి చేసింది.




**జేబులు గుల్లా?**

కోర్టులో కేసు ఉందని తెలిసినా.. సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు వారి ప్రయత్నాల్లో మునిగితేలారు. ఆ మేరకు భారీగా ఖర్చులు పెట్టుకున్నారు. నిజానికి ఎన్నికల నిబంధనల ప్రకారం చూస్తే.. జడ్పీటీసీ రూ.4 లక్షలు, ఎంపీటీసీ రూ.1.5 లక్షల లోపు ఖర్చుచేయాలి. సర్పంచ్, వార్డు మెంబర్ల విషయానికొస్తే.. ఐదు వేలకు పైగా జనాభా ఉంటే.. అక్కడ సర్పంచ్ బరిలో ఉండేవారు రూ.2.5 లక్షలు, వార్డుమెంబర్ రూ.50 వేలు.. అలాగే, ఐదు వేల లోపు జనాభా ఉంటే సర్పంచ్‌కు రూ.1.5 లక్షలు, వార్డుమెంబర్‌కు రూ.30 వేలు ఖర్చు చేయాలని ఎన్నికల సంఘం విడుదల చేసిన నిబంధనల్లో పేర్కొంది. సాధారణంగా ఏ ఎన్నికలైనా.. ఎన్నికల సంఘం సూచించే ఖర్చుకు%ా% అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పెట్టే డబ్బులకు ఏమాత్రం పొంతన ఉండదన్న విషయం అందరికీ తెలిసిందే. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు కూడా వీటికి అతీతం కాదు. ఒక్కో జడ్పీటీసీ ఆయా మండలాల్లో ఉన్న పోటీని బట్టి.. దాదాపు రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు, అలాగే ఎంపీటీసీలు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు పెడుతారు. సర్పంచ్‌లు అయితే.. మేజర్ పంచాయతీల్లో రూ.20 నుంచి రూ.30 లక్షలు, మైనర్ పంచాయతీలైతే రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చులు పెడుతారు. నిజానికి కొన్ని స్థానాల్లో ఇంతకు రెండింతలు కూడా అయ్యే అవకాశాలుంటాయి. ఎన్నికలు పక్కాగా జరిగి తీరుతాయని, 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతామంటూ.. ప్రభుత్వం, మంత్రులు పదే పదే చెప్పడం.. మరోవైపు రిజర్వేషన్లు ప్రకటించి షెడ్యూల్ విడుదల చేయడంతో చాలా చోట్ల పోటీదారులు రంగంలోకిదిగారు. తమ గెలుపుకోసం.. గ్రామాలు, మండలాల్లో దావతులు ఏర్పాటు చేశారు. పలు సంఘాలకు డబ్బులు ఇచ్చి తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ఆరంభించారు. పోటీదారుల్లో కొంత మంది ఒక అడుగు ముందుకేసి.. పలువురు నాయకుల నుంచి మద్దతు కూడగట్టేందుకు.. అలాగే, సదరు నాయకులు పోటీచేయకుండా ఉండేందుకు ఒప్పందాలు చేసుకొని కొంత ముట్టజెప్పారు. ఇంకా మిగిలిన మొత్తానికి కొన్ని చోట్ల ప్రామిసరీ నోట్, మరికొన్ని చోట్ల పెద్ద మనుషుల మధ్య ఒప్పందాలు, ఇంకొన్ని చోట్ల చెక్కులు కూడా ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. చాలా ప్రాంతాల్లో ఆశావహులు ఇప్పటికే.. 50 శాతం నుంచి 60 శాతం డబ్బు ఖర్చు చేశారన్న చర్చ సాగుతోంది. తీరా ఎన్నికలు వాయిదా పడడంతో.. జేబులు గుల్లా చేసుకున్న నాయకులు ఆందోళన చెందుతున్నారు.

**బీసీలే ఎక్కువ బాధితులు?**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సర్కారు జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. గతంలో 23 శాతం ఉండేది. ప్రభుత్వం తాజాగా, ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 19 శాతం రిజర్వేషన్ పెరిగింది. దీంతోపాటు.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ.. జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీలను ప్రకటించింది. దీంతో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా బీసీ నాయకులు ఆయా స్థానాల్లో రంగంలోకి దిగారు. నిజానికి ప్రభుత్వం ఇచ్చిన జీవో న్యాయస్థానాల్లో చెల్లదని, అది చట్టబద్ధంగా లేదంటూ.. న్యాయనిపుణులు, రాజకీయ విశ్లేషకులు చెప్పినా.. వాటిని మరిపించే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్భాటపు ప్రచారం చేశారు. రిజర్వేషన్లపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని, ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని, నిర్భయంగా పోటీ చేయాలని, మీ పోస్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది గ్యారెంటీ అంటూ.. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి వాట్సాప్ గ్రూపుల్లో మెస్సేజ్‌లు పెట్టి.. ఎన్నికల రంగంలోకి దిగే విధంగా ప్రేరేపించారు. మరో అడుగు ముందుకు వేసి.. ఏకంగా కొంత మందికి ఫోన్‌చేసి పోటీచేయాలని సూచించారు. దీంతో.. సదరు ఆశావహులు రంగంలోకి దిగి ఖర్చులు పెట్టుకున్నారు. తీరా ఇప్పుడు చూస్తే.. ఎన్నికలు వాయిదా పడ్డాయి. అలాగే.. 42 శాతం జీవో నిలిచే పరిస్థితి లేదు కాబట్టి.. ప్రస్తుతం ప్రకటించిన వాటిలో ఎస్సీ, ఎస్టీ మినహా బీసీల రిజర్వేషన్లు భారీగా మారే అవకాశం ఉంది. అదే జరిగి రిజర్వేషన్లు కలిసి రాకపోతే ఇప్పటి వరకు చేసిన ఖర్చులు, పెట్టిన డబ్బులకు ఎవరు బాధ్యత వహిస్తారన్న చర్చ ప్రస్తుతం హస్తం పార్టీలో నడుస్తోంది. ఒకవేళ రిజర్వేషన్లు కలిసి వచ్చినా.. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి ఉందని, అప్పటి వరకు.. మళ్లీ తిరిగి ఖర్చు పెట్టుకుంటే తప్ప.. మనుగడ ఉండదని భావిస్తున్నారు. అంటే సర్కారు చేసిన హడావుడి, నమ్మించిన తీరుకు భారీగా జేబులు గుల్లా చేసుకొని నష్టపోయామన్న అవేదన, బాధ ప్రస్తుతం బీసీ వర్గాల అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు మేమున్నామంటూ.. చెప్పిన నాయకులు ఆర్థికంగా నష్టపోయిన తమకు అండగా నిలుస్తారా? అన్న వాదనలు, ప్రతిపాదనలు ప్రస్తుతం అధికార పార్టీలో సాగుతున్నాయి. ముఖ్యమంత్రి మాటలు, ప్రభుత్వం చేసిన హడావుడిని నమ్మి ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి వచ్చిందన్న అవేదన వ్యక్తమవుతోంది. ముమ్ముందు ఈ పరిస్థితులు ఎటువైపు దారి తీస్తాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!



**ఢిల్లీ:** ఇజ్రాయెల్, గాజా శాంతి ఒప్పందం నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈజిప్టు వేదికగా సోమవారం జరగబోయే గాజా శాంతి ఒప్పందానికి హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీనిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. ఈ మేరకు జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. వివరాల ప్రకారం.. ఈజిప్ట్ వేదికగా రేపు ఇజ్రాయెల్ గాజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది. ఈ శాంతి ఒప్పందంలో ప్రధాని మోదీ హాజరు కావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీకి ఆహ్వానం పంపించారు. మరోవైపు.. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం. చివరి నిమిషంలో ప్రధాని మోదీకి ఈ ఆహ్వానం అందినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే.. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. మోదీ హాజరుపై ప్రకటన వెలువడాల్సి ఉంది.

**ఇరు పక్షాల అంగీకారం..**

ఇదిలా ఉండగా.. ఆకలి చావులతో రెండేళ్లుగా అల్లాడిపోతున్న కల్లోలిత గాజాలో శాంతి సాధనకు అడుగులుపడిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో మొదటి దశను వైరిపక్షాలైన ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఈ మేరకు ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేయబోతున్నాయి. రెండేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం పూర్తిగా ముగింపునకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి దశ ఒప్పందం ప్రకారం.. గాజాలో దాడులు వెంటనే ఆపేయాలి. తమ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను అతిత్వరలో హమాస్ మిలిటెంట్లు విడుదల చేయనున్నారు. అందుకు బదులుగా తమ నిర్బంధంలో ఉన్న పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం విముక్తి కల్పించనుంది. అలాగే గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లిపోనుంది.

**రెండు కీలకమైన అంశాలపై రాని స్పష్టత..**

హమాస్ అధీనంలో 20 మంది బందీలు సజీవంగా ఉన్నట్లు అంచనా. భగవంతుడి దయతో వారందరినీ స్వదేశానికి తీసుకొస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. హమాస్ సైతం స్పందించింది. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ సేనలు వెనక్కి వెళ్లిపోవాలని, గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతించాలని పేర్కొంది. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేస్తామని వెల్లడించింది. అందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను తమకు అప్పగించాలని తేల్చిచెప్పింది. మరోవైపు రెండు కీలకమైన అంశాలపై స్పష్టత రాలేదు. ట్రంప్ ప్లాన్ ప్రకారం హమాస్ మిలిటెంట్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి. గాజా పరిపాలన బాధ్యతలను నిపుణులతో కూడిన స్వతంత్ర పాలస్తీనా అథారిటీకి అప్పగించాలి. ఈ రెండింటిపై హమాస్ గానీ, ఇజ్రాయెల్ గానీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

# ‘బ్లూ స్టార్’కు ఇందిర మూల్యం చెల్లించారు’



**న్యూఢిల్లీ:** ‘నాడు ‘ఆపరేషన్ బ్లూ స్టార్’ చేపట్టాలనేది సమిష్టి నిర్ణయం అని, దీనిలో సైన్యం, పోలీసులు, నిఘా, పౌర సేవా రంగాలు పాల్గొన్నాయని, ఈ విషయంలో ఇందిరా గాంధీని మాత్రమే నిందించలేమని’ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలిలో జరిగిన ఒక సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న చిదంబరం 1984 నాటి ‘ఆపరేషన్ బ్లూ స్టార్’ను ప్రస్తావించారు. పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయాన్ని తిరిగి దక్కించుకునేందుకు అనుసరించిన తప్పుడు మార్గంగా ‘ఆపరేషన్ బ్లూ స్టార్’ను ఆయన అభివర్ణించారు. అయితే నాటి సమిష్టి నిర్ణయానికి ప్రధాని ఇందిరా గాంధీ అంతిమ మూల్యం చెల్లించారని చిదంబరం పేర్కొన్నారు. 1984, జూన్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో చొరబడిన ఉగ్రవాదులను తరిమికొట్టేందుకు ఉద్దేశించిన ఆర్మీ ఆపరేషన్ గురించి చిదంబరం మాట్లాడుతూ నాటి నిర్ణయం ఇందిరా గాంధీ ఒక్కరే తీసుకోలేదని స్పష్టం చేశారు. అది సమిష్టి నిర్ణయం అని, ఇందిగా గాంధీని మాత్రమే నిందించలేమని అన్నారు. అనంతరం పంజాబ్ గురించి మాట్లాడిన ఆయన ఖలిస్తాన్ ఉద్యమాలు చాలావరకు తగ్గిపోయాయని, ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులే ఆ రాష్ట్రానికి ప్రధాన సమస్యగా మారాయని అభిప్రాయపడ్డారు.

**ఆపరేషన్ బ్లూ స్టార్**

ఆపరేషన్ బ్లూ స్టార్ 1994, జూన్ ఒకటి నుండి జూన్ ఎనిమిది వరకు జరిగింది. అకల్ తఖ్త్, స్వర్ణ దేవాలయ సముదాయంలోకి చొరబడిన భింద్రాన్‌వాలే, అతని అనుచరులను తరిమికొట్టేందుకు ప్రభుత్వం ఆర్మీ ఆపరేషన్ ప్రారంభించింది. దీనిలో ట్యాంకులు, భారీ ఫిరంగిదళాలు పాల్గొన్నాయి. ఫలితంగా ఉగ్రవాదులు, సైనికులు, పౌరులు మరణించారు. ఈ దాడి సిక్కు సమాజాన్ని తీవ్రంగా బాధించింది. వారిలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. 1984 అక్టోబర్ 31న, స్వర్ణ దేవాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఇందిరా గాంధీని ఆమె సిక్కు అంగరక్షకులు హత్య చేశారు. అనంతరం భారతదేశం అంతటా సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి.

# ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!



బిహార్ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. భాజపా, జేడీయూలు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. కూటమి పక్షాలు ఈ సర్దుబాటును స్వాగతించాయని కేంద్రమంత్రి, భాజపా సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేశారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

**జేడీయూలో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల్లో సీట్ల కేటాయింపుపై ముమ్మర కసరత్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌కు చెందిన జేడీయూలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. 243 స్థానాల్లో 103 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉందని ఓ సీనియర్ నేత వెల్లడించారు. దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయని, నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని చెప్పారు. వారి పేర్లను మాత్రం ఆయన వెల్లడించలేదు. “జేడీయూ పోటీ చేయనున్న స్థానాలను ఇప్పటికే గుర్తించాం. ఆయా అభ్యర్థులను కూడా ఖరారు చేశాం. పనితీరు బాగాలేని నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను కొత్తవారితో భర్తీ చేసే అవకాశం ఉంది. భాగల్‌పుర్, నవాదా, బంకా జిల్లాల్లో ఈ నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అదేవిధంగా గత వారం మా ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ఆర్జేడీలో చేరిన నేపథ్యంలో.. పర్బత్తా స్థానంలో కొత్త అభ్యర్థిని బరిలోకి దింపనున్నాం. మాజీ ఎమ్మెల్యే బీమా భారతీ ప్రతిపక్ష పార్టీలో చేరడంతో.. రుపౌలిలోనూ ఇదే విధంగా ముందుకెళ్తాం” అని జేడీయూ నేత తెలిపారు. సీట్ల సర్దుబాటుపై ఎన్డీయే సీనియర్ నేతలు తగిన సమయంలో అధికారిక ప్రకటన చేస్తారన్నారు. ఎన్డీయేలో సీట్ల సర్దుబాటుపై ఆదివారం ప్రకటన వెలువడుతుందని భాజపా బిహార్‌శాఖ అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ ఇప్పటికే తెలిపారు. కాషాయ పార్టీ 102 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో 22 సీట్లలో పోటీ చేసిన లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్.. ఈసారి అదనపు సీట్లు అడుగుతున్నారు. ఎన్డీయేలోని హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం), రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)లకు గౌరవప్రదమైన సంఖ్యలో సీట్ల కేటాయింపు ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో వచ్చే నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# తొక్కిసలాట ఘటనకు సెంథిల్ బాలాజీనే కారణం




**కరూర్:** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదానికి డీఎంకే పార్టీ మాజీ నేత సెంథిల్ బాలాజీనే కారణమని ఆరోపించారు. పథకం ప్రకారం ఆయన ఆ ప్రాంతంలో తొక్కిసలాట జరిగేలా చేశారని..అందువల్లే 41మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2026 ఏప్రిల్ 20 తర్వాత తమిళనాడులో ఎన్డీఏ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని.. జనవరి 10 తర్వాత ఈ కూటమి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటారని నాగేంద్రన్ పేర్కొన్నారు. డీఎంకే కూటమిలోని రెండు వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వాటితో కలిసి పోటీ చేస్తుందా లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు. డీఎంకే అధికారం చేపట్టి నాలుగేళ్లైనా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమీ చేయని ముఖ్యమంత్రి స్టాలిన్ తన కొడుకును మాత్రం ఉప ముఖ్యమంత్రిని చేశారన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటన్నిటికి ఆయన జవాబు చెప్పాల్సి ఉంటుందన్నారు. కాగా కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒకవైపు విజయ్‌తో కూటమి చర్చలకు అన్నాడీఎంకే ప్రయత్నాలు చేస్తుండగా.. మరోవైపు టీవీకేతో పొత్తు పెట్టుకోవాలంటూ కాంగ్రెస్‌లోని ఓ వర్గం పట్టుపడుతున్నాయి. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిసామి ఈనెల 6న విజయ్‌కు ఫోన్ చేసి.. ఆయనకు పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో కూటమి ఏర్పాటు చర్చలకు ఆహ్వానం పలికినట్లు తెలుస్తోంది. ఉమ్మడి శత్రువైన డీఎంకేను వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓడించడానికి ఒకే కూటమి గొడుగు కిందకు రావడం అవసరమని సూచించగా పొంగల్ తర్వాత తన వైఖరి వెల్లడిస్తానని విజయ్ సమాధానం ఇచ్చారని సమాచారం. మరోవైపు కేంద్రమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

## సైనిక స్థావరాలపై తాలిబన్ల దాడి..



అఫ్గానిస్థాన్ పాకిస్థాన్ దేశాల సరిహద్దుల్లో ఇరు దేశాల సైన్యాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పాక్ సేనలు అఫ్గాన్ రాజధాని కాబూల్ పై దాడికి పాల్పడగా.. ప్రతీకారంగా తాలిబన్ సైన్యం పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది. ఈ క్రమంలో తాము 58 మంది పాకిస్థానీ సైనికులను మట్టుబెట్టామని అఫ్గానిస్థాన్ ప్రకటించింది. ఇస్లామాబాద్ పదేపదే తమ సరిహద్దుల ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు అఫ్గాన్ తెలిపింది. ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించొద్దని పాకిస్థాన్‌ను హెచ్చరించింది. కాబుల్‌తోపాటు ఓ మార్కెట్‌పై పాకిస్థాన్ బాంబు దాడులు చేసిందని ఇటీవల అఫ్గానిస్థాన్ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే పాక్ దళాలే లక్ష్యంగా ప్రతీకార దాడులు చేపట్టినట్లు తెలిపింది. తమ సేనలు పొరుగు దేశానికి చెందిన 25 ఆర్మీ పోస్టులను స్వాధీనం చేసుకున్నాయని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వెల్లడించారు. 58 మంది పాక్ సైనికులు మృతి చెందారని, మరో 30 మంది గాయపడ్డారని చెప్పారు. ఇటీవల కాబుల్‌లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ చీఫ్ నూర్ వాలి మెహ్సూద్ స్థావరం లక్ష్యంగా పాక్ యుద్ధవిమానాలు దాడి చేశాయి.

## ‘ఆమె’ అర్ధరాత్రి ఎందుకు బయటకు వెళ్లింది?: సీఎం మమత



**దుర్గాపూర్:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో శుక్రవారం(అక్టోబర్ 10వ తేదీ) వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరగడంపై సీఎం మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది తనను షాక్‌కు గురి చేసిందని, బాధితురాలికి కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అర్ధరాత్రి సమయంలో సదరు విద్యా?ర్థిని బయటకు వెళ్లడాన్ని మీడియా సమక్షంలో ప్రశ్నించారు. అసలు అర్ధరాత్రి సమయంలో విద్యార్థులను క్యాంపస్ నుండి బయటకు ఎలా వెళ్లనిచ్చారని సీఎం మమతా నిలదీశారు. ఇది సరైన పద్ధతి కాదని, విద్యార్థుల క్యాంపస్‌లు అనేవి అత్యంత పకడ్బందీగా ఉండాలని ఆమె అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితుల్ని పట్టుకుని శిక్ష పడేలా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న కాలేజీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. నైట్ కల్చర్‌కు విద్యార్థుల్ని దూరంగా ఉంచాల్సిన బాధ్యత ఆయా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలేదేనని స్పష్టం చేశారు. మరో వైపు విద్యార్థులు కూడా తమని తాము రక్షించుకునేలా ఉండాలన్నారు. ఆ విద్యార్థిని కాలేజ్ క్యాంపస్ నుండి రాత్రి గం. 12,30 ని.లకు ఎలా వచ్చిందన్నారు మమత. ఇ?క బీజేపీ అధికారంలో ఉన్న ఒడిశాలో కూడా ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయని, అలాగే ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్, బీహార్‌లలో కూడా అత్యాచార ఘటనలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

**మమత వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్**

మమతా బెనర్జీ వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీ మండిపడింది. బాధితురాలికి న్యాయం జరిగే మాటను పక్కను పెట్టి, వేరే ఏవో కథలు సీఎం మమత చెబుతున్నారని ధ్వజమెత్తింది. ఆర్జీ కర్, సందేశ్‌ఖలి తర్వాత, ఇప్పుడు ఈ భయంకరమైన కేసులో న్యాయం కాకుండా, ఆమె బాధితురాలినే నిందిస్తున్నారు’ అని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ‘ఎక్స్’ వేదికగా విమర్శించారు. అంటే సీఎం మమతా చెప్పేది ఏమిటంటే.. అర్ధరాత్రి అమ్మాయిలనేవారు బయటకు వెళ్లొదని చెబుతున్నారా? అంటూ ప్రశ్నించారు.

## అవసరమైతే పోరాటానికి వెనుకాడం.. ట్రంప్ టారిఫ్స్‌పై చైనా కామెంట్



చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై చైనా స్పందించింది. సుంకాల విషయంలో అగ్రరాజ్యం ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తోందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ దుయ్యబట్టింది. ట్రంప్ తీసుకుంటున్న ఈ చర్యలు తమ దేశ ప్రయోజనాలకు తీవ్ర హాని కలిగిస్తాయని చైనా ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణంగా తాము ఎవరితోనూ ఘర్షణలకు దిగమని, అవసరం వస్తే మాత్రం పోరాడటానికి వెనకాడమని స్పష్టంచేసింది. మాపై చర్యలకు ప్రతి చర్యలు కూడా ఉంటాయని తెలిపింది. ట్రంప్ ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలు ఇరుదేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య చర్చల వాతావరణాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నది. అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై ట్రంప్ ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగారు. ఈ క్రమంలోనే చైనా దిగుమతులపై అదనంగా మరో 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. నవంబర్ 1 నుంచి ఇవి అమలులోకి వస్తాయని తెలిపారు. చైనా తీసుకునే చర్యలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయన్నారు. గతంలోనూ అమెరికా–చైనాల మధ్య వాణిజ్యయుద్ధం జరిగింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చలు కూడా జరిగాయి. ఈ విధంగా ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ అది కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# పోరాడుతున్న వెస్టిండీస్..

స్పోర్ట్స్

## మూడో రోజు ముగిసిన ఆట

దిల్లీ: భారత్‌తో జరిగిన తొలి టెస్టులో విఫలమైన విండీస్ బ్యాటర్లు.. అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో కాస్త పుంజుకున్నారు. జట్టును ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించేందుకు పోరాడుతున్నారు. నాలుగో రోజు కూడా భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని ఎక్కువ సేపు క్రీజులో నిలిస్తే టీమ్ఇండియాకు కొంత లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశముంది. తొలి ఇన్నింగ్స్‌లో 140/4తో మూడో రోజు ఆటను కొనసాగించిన కరేబియన్ జట్టు.. కుల్‌దీప్ యాదవ్ (5/82) దెబ్బకు కుదేలై 248 పరుగులకు ఆలౌటైంది. దీంతో 270 పరుగులు వెనుకబడి 'ఫాలో ఆన్' నుంచి తప్పించుకోలేకపోయింది. త్యాగ్‌నారాయణ్ చందర్‌పాల్ (10), అథనాజ్ (7) విఫలమవడంతో వెస్టిండీస్ ఫాలో ఆన్‌లోనూ 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. దీంతో కరేబియన్ జట్టు మరోసారి కుప్పకూలి మూడో రోజే మ్యాచ్ ముగుస్తుందేమోనని అంతా భావించారు. కానీ, విండీస్ బ్యాటర్లు జాన్ కాంప్‌బెల్ (87బీ 145 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), షైయ్ హోప్ (66బీ 103 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాట పటిమ ప్రదర్శిస్తున్నారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి కరేబియన్ జట్టు 173/2 స్కోరుతో నిలిచి ఇంకా 97 పరుగుల వెనుకంజలో




ఉంది. కాంప్‌బెల్, షైయ్ హోప్ అభేద్యమైన మూడో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యాన్ని (207 బంతుల్లో) నెలకొల్పింది. ఈ జంటను విడదీయడానికి భారత బౌలర్లు ఎంతగానో శ్రమించినా ఫలితం లేకపోయింది. కాంప్‌బెల్ 69 బంతుల్లో, హోప్ 80 బంతుల్లో అర్ధ శతకాలు అందుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ బ్యాటర్లలో అథనాజ్ (41) టాప్ స్కోరర్. షైయ్ హోప్ (36), త్యాగ్‌నారాయణ్ చందర్‌పాల్ (34), అండర్సన్ ఫిలిప్ (24), టెవిన్ ఇమ్లాచ్ (21), ఖేరీ పియెరీ (23), జస్టిన్ గ్రీవ్స్ (21), జైడెన్ సీల్స్ (13) పరుగులు చేశారు. కుల్‌దీప్ ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. జడేజా 3, బుమ్రా, సిరాజ్ ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే.

## సౌతాఫ్రికాతో తొలి టెస్ట్.. రాణించిన పాక్ బ్యాటర్లు

రెండు టెస్ట్‌లు, మూడు టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ల కోసం సౌతాఫ్రికా జట్టు పాకిస్తాన్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ (అక్టోబర్ 12) తొలి టెస్ట్ మొదలైంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పాకిస్తాన్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు పాక్ బ్యాటర్లు తలో చేయి వేయడంతో పాక్ మంచి స్కోర్ సాధించింది. ఆట ముగిసే సమయానికి పాక్ 5 వికెట్ల నష్టానికి 313 పరుగులు చేసింది. పాక్ ఇన్నింగ్స్‌లో నలుగురు అర్ధ సెంచరీలు చేశారు. ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ (93) తృటిలో సెంచరీ మిస్ కాగా.. కెప్టెన్ షాన్ మసూద్ (76), వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్ (62), సల్మాన్ అఘా (52) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీలు చేశారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రిజ్వాన్, సల్మాన్ అఘా క్రీజ్‌లో ఉన్నారు. పాక్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (2), సౌద్ షకీల్ (0) పూర్తిగా నిరుత్సాహపరచగా.. బాబర్ ఆజమ్ (23) మంచి ఆరంభం లభించినా భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సెనురన్ ముత్తుసామి 2, రబాడ, ప్రెనెలన్ సుబ్రాయన్, సైమన్ హార్మర్ తలో వికెట్ తీశారు.



## ఒకే ఏడాదిలో వెయ్యి పరుగులు.. తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కిన మంధాన!





భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల వెల్లువ కొనసాగుతోంది. భీకర ఫామ్‌లో ఉన్న ఈ లెఫ్ట్ హ్యాండర్ వరల్డ్ కప్‌లో అర్ధ శతకంతో మరో మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసుకుందీ విధ్వంసక ఓపెనర్. దాంతో, మహిళా క్రికెట్ చరిత్రలో ఒక క్యాలండర్ ఇయర్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులతో ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టిందీ బ్యాటింగ్ క్వీన్. ఆసీస్ వెటరన్ అయిన క్లార్క్ 1997లో 970 రన్స్‌తో చరిత్ర సృష్టించింది. అప్పటినుంచి .. దాదాపు 27 ఏళ్లుగా చెక్కు చెదరని రికార్డును మంధాన బ్రేక్ చేసింది. మొత్తంగా 18 ఇన్నింగ్స్‌ల్లో మంధాన 59.00 సగటుతో 1,062 పరుగులు సాధించింది.

**ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో**


ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన పరుగుల వరద పారిస్తోంది. వరల్డ్ కప్ ముందే ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో కదం తొక్కిన ఈ డాషింగ్ బ్యాటర్ మెగా టోర్నీ తొలి రెండు మ్యాచుల్లో నిరాశపరిచింది. కానీ, వైజాగ్‌లో ప్రతీకా రావల్‌తో కలిసి ఆసీస్ బౌలర్లను ఉతికేస్తూ జట్టుకు శుభారంభం ఇచ్చిన మంధాన సెంచరీ ముందు ఔటయ్యింది. లేదంటే.. ఈ ఏడాది నాలుగు సెంచరీలతో రెండో స్థానంలో ఉన్న ఆమె తంజిబ్ బ్రిట్స్ రికార్డును సమం చేసేది. హాఫ్ సెంచరీ తర్వాత వెనుదిరిగిన మంధాన వన్డేల్లో 5వేల పరుగుల క్లబ్‌లో చేరింది.

## వేణు యెల్దండి 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ నుండి నితిన్ ఔట్.. మరో హీరోతో హిట్ కొట్టే ప్లాన్..!



డైరెక్టర్‌గా వేణు యెల్దండికి భారీ పేరు తీసుకొచ్చిన చిత్రం బలగం. ఆ సూపర్ హిట్ మూవీ తర్వాత ఆయన తెరకెక్కించబోయే కొత్త సినిమా 'ఎల్లమ్మ' పై గత కొంత కాలంగా టాలీవుడ్‌లో భారీ క్రేజ్ నెలకొంది. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ అధికారికంగా సెట్స్‌పైకి వెళ్లకపోవడం, హీరోయిన్, హీరో ఎంపికపై ఊహాగానాలు చక్కర్లు కొట్టడం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మించనున్నారు. మొదట్లో 'ఎల్లమ్మ' సినిమాలో యంగ్ హీరో నితిన్ హీరోగా నటించనున్నారని ప్రచారం జరిగింది. దిల్ రాజు స్వయంగా ఒక కార్యక్రమంలో ఇది వెల్లడించారు. అంతేకాదు, నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా రిలీజ్ అయిన తర్వాతే ఈ ప్రాజెక్ట్ మొదలవుతుందని ప్రకటించారు. అయితే ఇటీవల నితిన్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో 'ఎల్లమ్మ' లో హీరోగా మరొకరిని తీసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని టాక్.

నితిన్ స్థానంలో మొదటగా శర్వానంద్ పేరు వినిపించింది. కథ వినిపించగా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కూడా ప్రచారం జరిగింది. కానీ తాజాగా సోషల్ మీడియాలో కొత్త పేరు హల్‌చల్ చేస్తోంది. అది ఎవరో కాదు ఇటీవల 'కిష్కింధపురి' సినిమాతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఇప్పటికే నిర్మాతలు బెల్లంకొండతో చర్చలు జరుపుతున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ బెల్లంకొండ కాంపౌండ్ లోకి వెళ్లిందన్న వార్తలు వైరల్‌గా మారాయి. మేకర్స్ త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నట్టు కూడా సమాచారం. వేణు యెల్దండికి దిల్ రాజు బలమైన సపోర్ట్ అందిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్‌ను శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కించనున్నారని సమాచారం. అన్నీ అనుకున్నట్లే జరిగితే, వచ్చే కొన్ని వారాల్లోనే ఎల్లమ్మ మూవీకి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్, 'టైసన్ నాయుడు' అనే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సినిమా విడుదలకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇటీవలే 'కిష్కింధపురి' హిట్ తర్వాత ఆయనకి మళ్లీ క్రేజ్ పెరిగింది. ఇప్పుడు 'ఎల్లమ్మ' లాంటి ఎమోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలో ఆయన భాగం కావడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. మొత్తానికి 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ ఎవరితో సెట్స్‌పైకి వెళ్తుందనేది అధికారిక ప్రకటన వచ్చేంతవరకూ వేచి చూడక తప్పదు



## మ్ చరణ్ పెద్ది.. డేరింగ్ సీన్ లీక్!

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తోన్న స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంపై మెగా ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం చెర్రీ సరసన బాలీవుడ్ భామ, దేవర బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించనుంది. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పుణెలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఓ బ్యూటీఫుల్ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సాంగ్ షూటింగ్‌కు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పర్వత ప్రాంతంలో రామ్ చరణ్ స్టెప్పులు వేస్తోన్న వీడియో సోషల్ మీడియాలో లీక్ అయింది. చెర్రీ ఓ రాయిపై నిలబడి డ్యాన్స్ చేయడంపై డేరింగ్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. రామ్ చరణ్ డేరింగ్ డ్యాన్స్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. అయితే సాంగ్ షూట్ సీన్ లీక్ కావడం టాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ పాటకు ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తుండగా.. జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉంటుందని చిత్రబృందం పేర్కొన్న సంగతి తెలిసిందే. అందుకే పర్వత ప్రాంతాల్లోనే షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 60 శాతం షూటింగ్ పూర్తయిన ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

## సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా ట్రైలర్.. రిలీజ్‌లో ట్విస్ట్!

టిల్లు హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించిన తాజా చిత్రం తెలుసు కదా ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ మూవీలో రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మేకర్స్. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ రిలీజ్ చేసేందుకు రెడీ అయిపోయారు. ఈనెల 12 వైజాగ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ ఊహించని విధంగా ట్రైలర్ రిలీజ్ తేదీపై బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. ఈ రోజు ట్రైలర్ రిలీజ్ చేయడం లేదని పోస్టర్ ద్వారా వెల్లడించారు. అక్టోబర్ 13న ఉదయం 11 గంటల 34 నిమిషాలకు ట్రైలర్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో సిద్ధు ఫ్యాన్స్ కాస్త డిస్సాపాయింట్ అవుతున్నారు. కాగా.. ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.



PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.